# తెలంగాణాకే ప్రత్యేకం బతుకమ్మ సంస్కృతి

**కొడంగల్,సెప్టెంబర్ 29ప్రభాతవార్త** సంస్కృతి,సంప్రదాయాలు పల్లె జీవన విధానానికి అద్దం పడుతుతాయని,అనందాన్ని,ఆరోగ్యాన్ని పంచేందుకు బతుకమ్మ సంబురాలు ప్రతిబింబిస్తాయని కొడంగల్ మున్సిపల్ వైస్‌చైర్మేన్ ఉషారాణి రాజేందర్ అన్నారు. ఆదివారం తన నివాసంలో బతుకమ్మ సంబురాల్లో భాగంగా ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు.గత వారం రోజులుగా కుటుంబ బంధుత్వ మహిళా సంఘాల ఆద్వర్యంలో బతుకమ్మ పాట షూటింగ్ సందడి,సంబరాలు నిర్వహించారు.ఆదివారం రావే రావే.. బతుకమ్మ పాటను విడుదల చేశారు.ఈ సందర్బంగా అమె మాట్లాడుతు అనాదిగా వస్తున్న సాంస్రృతి,సంప్రదాయం బతుకమ్మ సంబురాలు అన్నారు.బతుకమ్మ పండుగ ప్రత్యేకంగా తెలంగాణాకే గర్వకారణమన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి స్వంత నియోజకవర్గంలో ముందస్తుగా బతుకమ్మ పాట సంబరాలతో విడదల చేయడం గర్వకారణమన్నారు.పండుగలు అనందానికి,ఆహ్లాదానికి నిర్వహించుకుంటారని కాగా బతుకమ్మ పండుగ ప్రత్యేకంగా ఆరోగ్యాన్ని పంచే ప్రకృతి సాంప్రదాయమని అన్నారు. మహిళలకు బతుకమ్మ పండుగ ఎంతో గుర్తింపునిస్తుందని అన్నారు.




# ఇసుకలారీకి మరొక నంబర్ ప్లేట్

## ఎంవిఐ ఫిర్యాదుతో కేసు నమోదు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** ఇసుకలారీ వేరే వాహనం నంబర్ ప్లేట్‌తో వెళ్లుండగా రవాణాశాఖ అధికారులు పట్టుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ యంనంపేట్ చౌరస్తాలో రాష్ట్ర స్పెషల్ విజి లెన్స్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఒక ఇసుకలారీ టిఎస్07యుఎన్0963 నెంబర్‌ప్లేట్‌తో ఉండగా అనుమానంతో విజిలెన్ బృందం ఆపి విచారించారు. లారీ పత్రాలు పరిశీలించగా వాహనం అసలు నెంబర్ టిజి30టి2345 గా ఉండటంతో డ్రైవర్ యు.గౌతమ్ (24)ను అదుపులోకి తీసుకొని లారీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరొక వాహనం నెంబర్‌ప్లేట్‌ను తన లారీకి అమర్చి అక్రమంగా ప్రభుత్వ అధికారులను మోసం చేస్తూ ఇసుక రవాణా చేస్తున్నట్లు నిర్ధారించారు. ఈమేరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు లారీ యాజమాని సుర్వి నరేశ్, డ్రైవర్ గౌతమ్‌లపై ఫిర్యాదు చేయగా ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# అక్రమార్కుల చెరలో గోపాజీకుంట

## ప్రభుత్వ శిఖంలో అక్రమనిర్మాణం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 29) :** భావి తరాలకు ఉపయోగపడే సాగునీటి రంగాలను అక్రమార్కులు చెర పడుతున్నారు. బాధ్యత గల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన చెరువు కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయి. అంతేకాదు ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని సైతం వదలడం లేదు. ఓ ప్రబుద్ధుడు ఏకంగా ప్రభుత్వ శిఖంలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాడు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రెవెన్యూ శివారులోని కాశిరెడ్డిగూడ పరిధిలో గల గోపాజీకుంటను కొందరు అక్రమార్కులు చెరపట్టారు. సర్వే నెం.804 లో గల 8 ఎకరాల 06 గుంటల శిఖం భూమి దర్జాగా అన్యాక్రాంతానికి గురవుతుంది. ఇదే గోపాజీకుంటలో కొంత భాగం వరకు ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. ప్రకృతివనంలోకి వెళ్లే గేటులో నిర్మల్ అనే వ్యక్తి పిల్లర్లతో నిర్మాణం చేశారు.



కుంట అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని

అదేవిధంగా అలాగే వరుసగా ఒక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గోపాజీకుంటకు వెనకవైపు జునెక్స్ బ్యాటరీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ఇది కుంట అగులు నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా అడ్డంగా నిర్మించారు. అదేవిధంగా ఓ రైతు కూడా ఒక 15 గుంటల్లో పంట పండిస్తున్నాడు. చెరువు మొత్తం శిఖం 8 ఎకరాల 06 గుంటలు ఉంటే వాటిలో చాలా వరకు కుంట శిఖం భూమి అన్యాక్రాంతానికి గురైంది. శిఖం స్థలంలో రోడ్లు కూడా వేసుకున్నారు. మరోవైపు నిర్మల్ అనే వ్యాపారి కుంట శిఖం స్థలాన్ని ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. కుంటకు సంబంధించి శిఖం భూమి అయినా, బఫర్ జోన్ అయినా లేక ఎఫ్‌టీఎల్ అయినా ఈ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడానికి ముమ్మాటికీ వీలులేదు. అయినప్పటికీ గ్రామ కార్యదర్శి చూసీచూడకుండా వ్యవహరించడం పట్ల అనేక విమర్శలు తలెత్తుతున్నాయి. అదేవిధంగా స్థానిక నాయకులు కొందరు మిలాఖత్ అయినట్లు చెబుతున్నారు.

### గోపాజీకుంటను సందర్శించిన టీడీపీ నేతలు

గోపాజీకుంట అక్రమాలపై స్థానిక తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్పందించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కాశిరెడ్డిగూడ, బూర్గుల నాయకులు అక్రమ నిర్మాణాలు తదితర అంశాలపై స్పందించారు. అధికారులు అక్రమాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చెరువు, కుంటలను రక్షించే బాధ్యత అధికారులపై లేదా అని ప్రశ్నించారు. గోపాజీకుంట శిఖం భూమిలో నిర్మాణాలకు అనుమతులు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. అక్రమాలు జరుగుతున్నా చూడకుండా వ్యవహరిస్తున్న గ్రామ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గోపాజీకుంటను కాపాడేందుకు మండల తహసీల్దార్ అదేవిధంగా ఇతర శాఖల అధికారులు రంగంలోకి దిగాలని, హైడ్రా తరహాలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని బక్కని నర్సింహులు డిమాండ్ చేశారు.

# ప్లాట్ల కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

## పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** తమ ప్లాట్లను కబ్జాకు పాల్పడిన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు మేడబోయిన జంగయ్య, కె. సుదర్శన్ రెడ్డిలు పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్‌కు చెందిన మెడబోయిన జంగయ్య ఫీర్జాదీగూడకు చెందిన మహ్మద్ మాలిక్ పాషా, ఏపీలోని కర్నూలు జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ నూర్ అహ్మద్ నుండి పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లిలోని శ్రీరాంనగర్ కాలనీ సర్వేనెంబరు 27,28లలో 249 గజాల స్థలాన్ని కొనుగోలు చేయుటకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇట్టి ప్లాటును గతంలో హైదరాబాద్‌కు చెందిన కె. లీలావతి వద్ద నుండి డాక్యుమెంటు నెంబరు 3088 బై 2021 ద్వారా మహ్మద్ మాలిక్ పాషా, నూర్ అహ్మద్‌లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. తమ ప్లాటును జైన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ వారు కాలనీలో గల పార్కు, కమ్యూనిటీ హాలుకు కేటాయించిన స్థలాన్ని అక్రమించి తమ ప్లాటును అక్రమించినట్లు తెలిపారు. తమ ప్లాటులోకి రానీయకుండా సదరు సంస్థ ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఇదే కాలనీలో కొంపల్లికి చెందిన కందాడి సుదర్శన్ రెడ్డి సర్వే నెంబరు 27,28లలో 248 గజాల స్థలాన్ని కొనుగోలు ఒప్పందం చేసుకోగా జైన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఎండీ ప్లాటులోకి రానీయకుండా అడ్డుకుంటున్నాడని బాధితుడు పోలీసులను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.



బాధితులకు ప్రభుత్వ న్యాయం చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను బాధితులు కలిసి వినతిపత్రాన్ని అందజేసిన దృశ్యం

# తూంకుంట రాజీవ్‌రహదారి వెడల్పు కోసం బిల్డింగ్‌ల కట్టింగ్‌కు మార్కింగ్

**శామీర్‌పేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

తూంకుంట వద్ద రాజీవ్‌రహదారి వెడల్పులో భాగంగ రోడ్డుకు ఇరువైపుల బిల్డింగ్‌ల కట్టింగ్ కోసం సంబంధిత అధికారులు మార్కింగ్ చేశారని దీంతో సుమారు 200మంది వరకు జీవనోపాధి కోల్పోవలసి వస్తుందని, తూంకుంట తెలంగాణ స్పోర్ట్సు స్కూల్ వద్ద నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేసి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను తూంకుంట బాధితులు కలిసి వినతిపత్రం అందజేసి కోరారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలో తూంకుంట రాజీవ్‌రహదారి రోడ్డుకు ఇరువైపుల ఉన్న భవనాలకు 30మీటర్ల రోడ్డు వెడల్పులకు భవనాలకు మార్కింగ్ చేశారని, 200ఫీట్లలో ఉన్న ఇళ్లు, భవనాలు చాలా పోవటం జరుగుతుందన్నారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపులు, పలు వ్యాపారాలతో జీవనోపాధి పొందటం జరుగుతుందన్నారు. సుమారు 200కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ప్రభుత్వం పునరాలోచించాలని, ఒక వేళ తగ్గించని పక్షంలో తూంకుంటలోని తెలంగాణ స్పోర్ట్సు స్కూల్ వద్ద నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని బాధితులు కోరారు. తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ బాధితులు పలువురు కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకవెళతానని అన్నారని బాధితులు పేర్కొన్నారు. దీనిలో తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్‌యాదవ్, నాయకులు కె.సుభాష్‌గౌడ్, పలువురు బాధితులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణతో నేడు దేశ విదేశాల్లో ఉద్యోగాలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 29) :** మైక్రోసాఫ్ట్ కంపెనీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణను ఇచ్చి దేశ విదేశాల్లో చాలా మందికి ఉపాధి మార్గాలు చూపించడం ఎంతో గొప్ప విషయమని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న అభినందించారు. గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మైక్రోసాఫ్ట్ టెక్ స్కిల్లింగ్ ప్రాజెక్ట డేటా సైన్స్ ట్రైనింగ్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాకు ఆయన తెలియజేస్తూ మూడు నెలల పాటు షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో సుమారు మూడు లక్షల విలువైన శిక్షణను అందజేసినట్లు వివరించారు. ఇంజనీరింగ్, జనరల్ డిగ్రీ చేసిన వారికి ఉచితంగా 46 మందికి శిక్షణ ఇవ్వగా, 35 మంది ప్యాకేజీలతో దేశ, విదేశాల్లో పేమెంట్లు పొందారని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపాలిటీ సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ద్వారా ఇది సాధించడం గొప్ప విజయంగా మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

# కృష్ణను పరామర్శించిన బిజెపి నేత పివిఆర్



ఆసుపత్రిలో కృష్ణను పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

**షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు 29, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఇటీవల అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, తదితర బీజేపీ నేతలు ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ధైర్యాన్ని ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీజేపీ నేతలు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చేగు సుధాకర్‌అప్ప తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన ఎంపి బిబి పాటిల్



మాజీ ఎంపీ బిబి పాటిల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 29) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన జహీరాబాద్ మాజీ పార్లమెంటు సభ్యులు బీబీ పాటిల్ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షుడు అగ్గనూరు బస్వం, నేతలు చెంది తిరుపతిరెడ్డి, ఈశ్వర్ రాజు, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పట్టణంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఇరువురు నేతలు హాజరయ్యారు.

# కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

**ధారూర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్ట ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. పచ్చని చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణం చల్లని గాలి ఉండడంతో పార్యటకులు ఇక్కడ గడిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రాజెక్టులో పార్యటకులు సెల్ఫీలు దిగుతూ బోటింగ్ చేసేందుకు అధిక ప్రాధాన్యత నిచ్చారు. ప్రాజెక్టుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పర్యటకుల రాకతో ప్రాజెక్ట పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది.



కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

# అంబేద్కర్‌తోనే సమాజంలో సమాన హక్కులు



అంబేద్కర్‌కు నివాళులు అర్పించి మాట్లాడుతున్న అనిల్‌రెడ్డి, అరుణ్‌కుమార్

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** మహనీయుడు బిఆర్.అంబేద్కర్ ద్వారా సమాజంలో అందిరికి సమావహక్కులు సిద్దించాయని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు నమిలికొండ అనిల్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 181వ వారం నిత్య పూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీర్జాదిగూడ ఎంసీ బిజెపి అధ్యక్షులు అనిల్‌రెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆడ, మగ సమానంగా పోటీ పడుతున్నారని తెలిపారు. అందరికి ఓటు హక్కును కల్పించి దేశం ప్రపంచతో పోటీ పడే స్థాయికి తీసుకువెళ్లిన ఘనత బాబాసాహెబ్ అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. మహనీయుల ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజ్యాంగపీఠిక పుస్తకాన్ని ప్రదర్శించి అందరూ ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, ప్రధానకార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు కె.సత్యం, ఎం.రాజేశ్‌కుమార్, వెంకట్ రాళ్లబండి, ఆర్.సంగమేశ్వర్, కె.సుధాకర్, బి.గణేశ్‌గౌడ్, ఇ.జగదీష్, ఎం.రాములు, ఎస్.కృష్ణంరాజు, వై.వెంకటేశ్వర్‌రావు, వేమూరి కళ్యాణ్‌శ్రీనివాస్, టి.శ్రీరామ్, కె.సాయి, జి.ప్రవీణ్, జె.అఖిల్, జె.సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

# దాతల సాయంతో నిర్మించిన భూగర్భడ్రైనేజీ ప్రారంభం



భూగర్భడ్రైనేజీని ప్రారంభోత్సవం చేసిన చైర్మన్ కొండల్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడ సాయి గణేశ్ నగర్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీని ఆదివారం మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం చేశారు. సాయి గణేశ్‌నగర్ కాలనీలో దాదాపు 46 మీటర్ల భూగర్భడ్రైనేజీ పనులను ఒక లక్షా ఇరవైవేల రూపాయలతో నిర్మించినట్లు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధిలో దాతలు సహకరించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. దాతలు వెంకట్ రెడ్డి, నరేశ్, ప్రశాంత్, ఆనంద్, సాయికుమార్ తదితరులను శాలువా కప్పి చైర్మన్ సత్కరించారు.

### మీరాలం కుంట వద్ద స్వచ్ఛత హి సేవ శ్రమదానం

పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడ మిరాలం కుంట వద్ద స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఇన్ఫోసిస్ కంపెనీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమం చేశారు. చెరువు పరిసరా ప్రాంతాల్లో గల చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ రవీందర్ గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, ఆకిటి బాల్‌రెడ్డి, అబ్బవతి నర్సింహ, నర్రీ కాశయ్య, ఇన్ఫోసిస్ ప్రతినిధులు వంశీ, రాజశేఖర్, కార్తిక్, ఆదిత్య, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి భరించలేక మహిళ బలవన్మరణం

**పెద్దేముల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కడుపునొప్పి బాధ భరించలేక ఓ మహిళా ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం కందనెల్లితాండాకు చెందిన రాథోడ్ రాంబాయి (49)పాలిష్‌మిషన్‌లో కూలి పనిచేస్తు జీవనం కొనసాగించేంది. అయితే అప్పుడప్పుడు ఆమే కడుపునొప్పితో భాధపడుతుండేది. సుమారు మూడు సంవత్సరాల క్రితం గర్బసంచి ఆపరేషన్ కూడా చేసుకుంది. ఆదివారం మళ్ళి కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక ఇంట్లో దూలానికి ఉరివేసుకొనిఆత్మహత్య చేసుకుంది. మృతుడి కొడుకు రాథోడ్ సంతోష్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



సోమశిల యాత్రలో ఆఫీసర్స్ కాలనీ వాసులు

# సోమశిల యాత్ర విజయవంతం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 29) :** పట్టణంలోని ఆఫీసర్స్ కాలనీవాసులు సోమశిల యాత్రను చేపట్టారు. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాలనీ వాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చెట్ల నర్సింహులు, టీఎన్జీవో అధ్య క్షులు ఎం. వెంకట్‌రెడ్డి, భగవాన్ దాస్, భూపాల్ రెడ్డి, టీచర్ రాజు, అడ్వకేట్ చెట్ల శంకర్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెట్ల వెంకటేష్, హైకోర్టు అడ్వకేట్ మేకల సంతోష్, ఎల్ఐసి రాజు, కృష్ణ, రాజేష్, మహేంద్ర రెడ్డి, తిరుపతి గౌడ్, రాము గౌడ్, వాడ్యాల సునిల్ రెడ్డి, అక్రమ్, చెట్ల మహేష్, శ్రీనివాస్, జుట్టు నర్సింలు, కిషన్ నాయక్, శ్రీనివాసచారి, యాదయ్య, బెలగం శ్రీనివాస్ రెడ్డి, ర్యాకల ఈశ్వర్, సిద్ధల శ్రీనాథ్, బండి శ్రీనాథ్, శ్రీనివాస్, హర్మల్ రవిప్రకాశ్, దుంపల రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

## భార్యాభర్తలకు గాయాలు

**కేశంపేట, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** 45 రోజుల కుమారుడు మహేందర్ ఆరోగ్యం బాగుండకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లడానికి భార్యాభర్తలు కూమారుడుని తీసుకుని తమ బైక్‌పై బయలుదేరి వస్తుండగా దంపతులకు రోడ్డు ప్రమాదం జరగడంతో కుమారుడు మృత్యువాత పడ్డ సంఘన మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కేశంపేట ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కంకిరాళ్లతండా గ్రామానికి చెందిన వడ్డవాత్ రమేష్ అతని భార్య పద్మ అతని కుమారుడు మహేందర్‌తో కలిసి నిర్ధావెళ్ల గ్రామంలో ఉన్న ఆసుప త్రికి తమ ద్విచక్ర వాహనంపై బయలు దేరి తిరిగి వస్తుండగా బోదునంపల్లి గ్రామ శివారులో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ సంఘటలో ఇరువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శంషాబా ద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మహేందర్ పరిస్థితి విషమంగా ఉండడంతో నీలాఫర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృ తి చెందినట్లు నరసింహ తెలిపారు. నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

# వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాలి : నాగచంద్రికాదేవి

**శంషాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** తమ తమ కుటుంబాలలోని వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా కుటుంబ సభ్యులపై ఉంటుందని కిన్నెర సొసైటీ వ్యవస్థాపకులు నాగచంద్రికా దేవి అన్నారు. అంతర్జాయతీ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరిం చుకుని శంషాబాద్ మండలంలోని ముచ్చింతల గ్రామంలో గ్రామ సర్పంచులు కార్యదర్శులకు వయోవృద్ధులకు సంరక్షణ చట్టపై అవగాహన కల్పించారు. 1997-2007లో రూపొందించిన వృద్ధుల సంరక్షణ వారి హక్కుల పరిరక్షణ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగచంద్రకాదేవి మాట్లాడుతూ సమాజం పట్ల అపారమైన అనుభవం ఉన్న వృద్ధుల ద్వారా సూచనలు సలహాలు తీసుకుని సమాజాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వారిపట్ల ప్రేమానురాగాలను ఆప్యాయతను ప్రదర్శించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పార్థసారధి నాగేశ్వరరావు హెల్పేజ్ ఇండియా కోఆర్డినేటర్ శ్యామ్ డిడబ్ల్యుఓ పద్మజ ముచ్చింతల మాజీ సర్పంచులు వడ్డే సుజాత బీర్ల పెంటయ్య మాజీ ఎంపిటిసి వడ్డే చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



వయోవృద్ధుల సంరక్షణ చట్టపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**కడ్తాల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు, రాష్ట్ర బిసి సంఘం ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ అన్నారు. తలకొండపల్లి చౌరస్తా వద్ద హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాల్వ పనులు కొనసాగుతున్నాయి. రాఘవేందర్ మాట్లాడుతూ పనులను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని వారు సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రచయిత్రి విజయభారతి మృతి పట్ల

# స్పీకర్ ప్రసాద్ కుమార్ సంతాపం

**మర్పల్లి సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రముఖ రచయిత డాక్టర్ విజయభారతి శనివారం నాడు మృతి చెందడంతో విదేశీ పర్యటనలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ తన సంతాపం వ్యక్తం చేశారు.కోంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఓ ఆసుపత్రి లో తుది శ్వాస విడిచారు. సాహితీ వేత్తగా,విశ్లేషకురాలిగా విజయభారతి చేసిన సేవలు చిరస్మరణీయమని అయిన అన్నారు.



శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

## బతుకమ్మల కోసం తాత్కాలిక నీటి వసతిని ఏర్పాటు చేయాలి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేకంగా బతుకమ్మలు వేయడానికి తాత్కాలిక నీటితొట్లను బన్సీలాల్‌పేట్‌లోని దేవాలయాల వద్ద ఏర్పాటు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు డివిజన్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు నిమ్మ నాగలక్ష్మీ, డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్‌రాజులు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్సవాల సమయంలో ఇలాంటి ఏర్పాట్లు జరిపేవారని, ఇప్పుడు కూడా ఏర్పాటు చేయాలని వారు కోరారు.

**ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానం.....**

దేశి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే, మాజీమంత్రి తలసాని శ్రీనివస్‌యాదవ్‌ను బన్సీలాల్‌పేట్ గాంధీనగర్ సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు కోరారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసం వద్ద ఆదివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, వెంకటేశ్, చందర్ యాదవ్, సుదర్శన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌జీ అస్పత్రి ఆధ్వర్యంలో 5కె రన్



5కె రన్‌లో పాల్గొన్న ఉద్యోగులు

**నిజాంపేట్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** మనమంతా గుండెను జాగ్రత్తగా కాపాడుకోవాలని, ప్రతిరోజు కనీసం 45 నిమిషాలు నడవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతోనే ఇది సాధ్యమని నగరంలోని ప్రధాన ఆస్పత్రులలో ఒకటైన ఎస్ఎల్‌జీ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ దండు శివరామరాజు అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి ఆధ్వరనయంలో నిర్వహించిన 5కె రన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. చుట్టుపక్కల కాలనీలకు చెందిన దాదాపు 400 మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ఈ పరుగు, చివరకు మళ్లీ 7.45 గంటలకు ఆస్పత్రి వద్దే ముగిసింది. కొద్దిసేపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పరుగులో పాల్గొన్న అందరికీ అల్పాహారాలు అందించారు. ప్రధానంగా నిజాంపేట, కూకట్‌పల్లి, కౌసల్యకాలనీ, బండారి లేఅవుట్, బాచుపల్లి తదితర ప్రాంతాల్లోని వివిధ అపార్ట్‌మెంట్, రెసిడెన్షియల్ సొసైటీలకు చెందినవారు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్థానికులలో బేసిక్ లైఫ్ సపోర్ట్, కార్డియోపల్మనరీ రీససిటేషన్‌లలో శిక్షణ ఇచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైస్‌ఛైర్‌పర్సన్, కౌన్సిలర్

**హయత్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే ద్యేయంగా పనిచేస్తున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ చామసంపూర్ణా విజయశేఖర్‌రెడ్డి, 21వ వార్డు కౌన్సిలర్ ఒరుగంటి సుజాతకిషన్‌గౌడ్ అన్నారు. వార్డు పరిధిలో శ్రీలక్ష్మినగర్ నుంచి బృందావన్ కాలనీ వరకు 16 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, బృందావన్ కాలనీలో 3 లక్షలతో చేపట్టనున్న పార్కుల ప్రహారీలు, ఫెన్సింగ్ పనులకు వారు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం బృందావన్ కాలనీలో లో-వోల్టేజీ సమస్యను పరిష్కరించడం కోసం ఏర్పాటుచేసిన 160కె.వి. ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాలుగున్నరేళ్లుగా వార్డు పరిధిలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని, తమ పదవీ కాలం పూర్తయ్యేలోగా ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేసారం బాల్‌రెడ్డి, ఒరుగంటి కొండల్‌గౌడ్, జోర్కశ్రీరాములు, బద్దం శ్రీకాంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సయ్యద్, శంకర్ యాదవ్, కాలనీల అధ్యక్షులు జగన్‌ప్రసాద్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: మల్‌రెడ్డి రంగారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

**హయత్‌నగర్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మైనారిటీల ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన పెద్దఅంబర్‌పేటలో మిలాద్-ఉన్-నబీకార్యక్రమానికి హాజరై జామా మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మైనారిటీల ప్రయోజనాల కోసం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చల్లూరి మురళీధర్‌రెడ్డి, సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, నాయకులు పండుగుల రాజు, చామ విజయశేఖర్‌రెడ్డి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం

**నాంపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియలలో అశేషకృషిచేసిన ఎనిమిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య విలేకరులకు తెలిపారు. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహేకి; ఆచార్య పాకాల యశోదారెడ్డి పురస్కారం డా. భాస్కరయోగికి; డా. బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారం మోత్కూరి నరహరికి; డా. చింతపల్లి వసుంధరారెడ్డి జనపద సాహిత్య పురస్కారం ఆచార్య ఎన్.భక్తవత్సలరెడ్డికి ఆలూరి బైరాగి కవితా పురస్కారం నాగవరం బాలరాంకు; డా. వానమామలై వరదాచార్యుల పురస్కారం డా, వెల్దండ సత్యనారాయణకు; ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారం రేడియం(జె.కొండన్న)కు; డా. దివాకర్ల వెంకటావధాని పురస్కారం డా. తిరుమల శ్రీనివాసాచార్యకు బహూకరిస్తారని వివరించారు. అక్టోబరు 4 శుక్రవారం సాయంత్రం 5.30గంటల నుండి బొగ్గులకుంట సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పురస్కార స్వీకర్తలకు పురస్కారంతోపాటు 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరిస్తారని చెన్నయ్య పేర్కొన్నారు.

# రాజ్యాంగానికి వ్యతిరేకంగా వర్గీకరణ చేస్తే సహించేది లేదు

**ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ**



మాట్లాడుతున్న మన్నే శ్రీధర్‌రావు

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా, ప్రధాని నరేంద్రమోదీ ప్రేరణతో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై తీర్పు వచ్చిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటి కన్వీనర్లు మన్నే శ్రీధర్‌రావు, పి.బల్వంత్‌రావు, పర్సపు శ్రీధర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం ట్యాంక్‌బండ్ వద్దగల డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట కమిటీ ఆధ్వర్యంలో అనేక మంది ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరకమేన ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయని తక్షణమే సుప్రీంకోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కులగణన చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం తీర్పు ఏలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణపై ఆర్డినెన్స్ తీసుకువచ్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమని, మంత్రుల కమిటీని తక్షణమే రద్దుచేయాలని, ఈ కమిటీలో మాల ప్రజా ప్రతినిధి ఒక్కరూ లేరన్నారు. ఈ కమిటీవల్ల ఒరిగేది ఏమిలేదని, మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడమేనని ఆరోపించారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిచే జ్యుడిషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వర్గీకరణ అంశానికి తెరదించకపోతే రాష్ట్రంలో లక్షలాది మంది మాలలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ ధర్నాలో కమిటీ కన్వీనర్లు చింతల రాంచందర్, జనార్థన్, రాఘవేందర్, క్రాంతి, స్వామి, ఉమాకాంత్, సహదేవ్, మల్లికార్జున్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బాలచెలిమి గ్రంథాలను పంపిణీ చేస్తున్న వేదకుమార్

## బాలచెలిమి గ్రంథాయాల ప్రాముఖ్యతను సిఎం దృష్టికి తీసుకెళతా

**హైదరాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో బాలచెలిమి గ్రంథాలయ ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్ చెప్పారు. ఈ వేదిక ప్రాంగణాన్ని తెలంగాణ చైతన్యాన్ని కలిగించే ప్రదేశంగా చూస్తామన్నారు. చిల్డ్రన్స్ ఎడుకేషనల్ అకాడమీ, బాలచెలిమి గ్రంథాలయాల నిర్వహణపై కార్యశాల హిమాయత్‌నగర్‌లోని ఆక్స్ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రియాజ్ మాట్లాడుతూ అనేక కోణాలలో కనిపించే అతి కొద్ది మందిలో బాలచెలిమి, దక్కన్ ల్యాండ్ పత్రికల సంపాదకులు మణికొండ వేదకుమార్ ముఖ్యలని, ఆయన ఒక వ్యక్తి కాదని, వ్యవస్థ అని అన్నారు. గ్రంథాయాల వారోత్సవాల్లో భాగంగా బాలచెలిమి వారియర్స్‌తో ఒకపూట సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. పుస్తక ప్రదర్శనశాలలో కూడా బాలచెలిమి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎం.వేదకుమార్ మాట్లాడుతూ చిల్డ్రన్స్ ఎడుకేషనల్ అకాడమీ లక్ష్యాలు, కార్యచరణ గురించి వివరించారు. అందులో భాగంగా సృజనాత్మక కార్యక్రమాల నిర్వహణతో 15 జిల్లాలలో బాలచెలిమి గ్రంథాయాలు ఏర్పాటు చేశామని, 100 బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డా.బి.వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ చెకొని రవికుమార్, రచయిత్రి డా.అమరవాది నీరజ, మహ అకాడమీ డైరెక్టర్ మల్లికార్జున్, రాజలింగం, అశోక్‌కుమార్, ఖైజర్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌ను మూసివేయాలి



మాట్లాడుతున్న జవహర్‌నగర్ డంపింగ్‌యర్డు సన్నాహక కమిటీ నేతలు

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** దమ్మాయిగూడలోని జవహర్ నగర్ డంపింగ్‌యార్డ్‌ను శాశ్వతంగా మూసివేయాలని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సన్నాహక కమిటీ నేతలు గోగుల రామకృష్ణ, కేతుపల్లి పద్మాచారి, మారెం సమ్మిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సందీప్ తదితరులు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటుచేసిన రోజు నుండి స్థానిక ప్రజలు అనేక రోగాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి ఎంపీగాఉన్న సమయంలో మా ఇబ్బందులు గుర్తించి, తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జేఏసీ నేతలు ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం రాంకీ సంస్థకు ఊడిగం చేస్తోందని, తక్షణమే రాంకీ సంస్థను రద్దు చేసి, దమ్మాయిగూడలోని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్‌ను నగర నలుమూలలకు తరలించి, మా ఆరోగ్యాలు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే దమ్మాయిగూడ ప్రజలందరూ కలసి డంపింగ్ కోసం వచ్చే లారీలను అడ్డుకుని ఎక్కడికక్కడ నిర్భంధం చేస్తామని హెచ్చరించారు. సీఎం స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నేడు ఛలో లేబర్ కమిషనరేట్ : సిఐటియు

నిజాంపేట్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త : కాంట్రాక్ట్ వర్కర్స్ ఔట్సోర్సింగ్ కార్మికులు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి నగర్ బాచుపల్లి ఏరియాలలో సిఐటియు ఆధ్వర్యంలో సభలు సమావేశాలు నిర్వహించారు. నేడు ఛలో లేబర్ కమీషనర్ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు జి.వెంకటరాజం పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని, 8 గంటల పని దినం అమలు చేయాలని, కనీస వేతనం 26వేలుగా నిర్ణయించాలని కోరారు. ఈఎస్ఐ, పిఎఫ్ బోనస్ గ్రాట్యూటీ అమలు చేయాలని, అపాయింట్మెంట్ లెటర్స్ గుర్తింపు కార్డులు ప్లే స్లిప్పులు ఇవ్వాలన్నారు. మహిళా కార్మికులకు రెస్టరూమ్‌లు, పసిపిల్లలకు క్రెచ్ సౌకర్యం కల్పించాలని లైంగిన వేధింపులు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ, చెన్నయ్య, వెంకన్న మద్దిలేటి, నరసింహ శ్రీను, మనీ, లక్ష్మీ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 9న తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ సదస్సు

**చిక్కడపల్లి సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ సదస్సు అక్టోబరు 9న నిర్వహించబోతున్నట్లు ఫ్రంట్ రాష్ట్ర కమిటీ తెలిపింది. నగరంలో రెడ్‌హిల్స్‌లో మారుతి ఫంక్షన్ హాల్‌లో సదస్సు ఉంటుందని తెలిపింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం ఆవరణలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఫ్రంట్ ప్రతినిధులు నాగభూషణం, అంబయ్య, ముత్తన్నయాదవ్, రాంబాబు, సత్యనారాయణ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాల ద్వారా సాధించుకోగలమని నమ్మిన ఉద్యమకారుల ఉద్యమ సంస్థలు, ప్రజాస్వామికవాదులు కలిసి ఈ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామని, ప్రజాయుద్ధనౌక గద్దర్ మొదటి అధ్యక్షుడిగా, అనంతరం ఆకుల భూమయ్య పులిమామిడి, మద్దిలేటిలు అధ్యక్షులుగా కొనసాగి అమరులైనారని అన్నారు. ఈ ఫ్రంట్ ప్రజాస్వామిక తెలంగాణ నినాదంతో ఏర్పడిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకా ప్రజాస్వామికహక్కులు, ప్రజల ఆకాంక్షల అమలుకు పోరాడుతున్నామని, నేటి పాలకుల ప్రజావ్యతిరేక పాలన విధానాలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామిక హక్కులకై ప్రజలందరు ఫ్రంట్‌లో భాగమై పోరాటం చేస్తామన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిజెపి గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతీ కుటుంబానికి లబ్ది చేకూరేలా బిజెపి కార్యకర్తలు కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్ బిజెపి కార్యాలయం ఆవరణలో ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఇరవై వేల సభ్యత్వాన్ని పూర్తి చేయాలని, బిజెపిలో చేరటానికి యువత సిద్దంగా ఉన్నారని తెలిపారు.స్థానిక సంస్థలు ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలుపాటు పడాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ మల్లేష్ యాదవ్, సీనియర్ బిజెపి నాయకులు రావుల భాస్కర్, నరసింహారెడ్డి, మజర్, షకీల్, హన్మంతురెడ్డి, రాజ్‌కుమార్, సురేష్, అంజమ్మ, నందిని,శంకర్‌తో పాటు బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజశ్రేయస్సుకు గాంధీతత్వం ఎంతో అవసరం

**తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**నాంపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** సమాజ శ్రేయస్సు కోరుతూ గాంధీ తత్వాన్ని నేటితరంలో పెంపొందించాలనే ఆశయం ఎంతోఅ వసరమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి శివార్చక విజయ కుమార్ చేపట్టిన పాదయాత్రకు ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లల బంగారు భవితను దృష్టిలో పెట్టుకొని మాజీ విద్యాశాఖాధికారి డా. శివార్చక విజయకుమార్ సారథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబరు 2 నుండి 12 జనవరి 2025 వరకు 100రోజులపాటు 1000 కిలోమీటర్లు బాపుబాటలో సత్యశోధన శీర్షిక అలంపూర్, జోగులాంబ దేవాలయం నుండి నాగర్‌కర్నూల్ అచ్చంపేట ఉమామహేశ్వర దేవాలయం వరకు నిర్వహించ తలపెట్టిన పాదయాత్ర గోడ పత్రికను డా. కె.వి.రమణాచారి డా. విజయకుమార్, బడేసాబ్, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులతో కలిసి రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆవిష్కరించి విజయకుమార్ పాదయాత్ర, ఉద్దేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి రూ.7కోట్ల నిధులు : పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :**

ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.7 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తెలిపారు. డివిజన్‌లో సిసి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సూర్యనగర్, శ్రీరామకాలనీ, లక్ష్మారెడ్డికాలనీ, శేషసాయినగర్, సౌత్ స్వరూప్‌నగర్, స్వరూప్‌నగర్ కాలనీలలో సిసి రోడ్లు వేసేందుకు రూ.2 కోట్ల నిధులు, శేషసాయినగర్ నుంచి ఉప్పల్ నల్ల చెరువు వరకు నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.1 కోటి 95లక్షలు, టివికాలనీ, శ్రీరమణపురం సిసి రోడ్డు నిర్మాణానికి రూ.90లక్షలు, సత్యనగర్ నుంచి సూర్యనగర్ వరకు సిసి రోడ్డు నిర్మాణానికి రూ. ఒక కోటి 86లక్షలు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాగా గడ్డిఅన్నారం మార్కెట్ కమిటి చైర్మన్ చిలుకా మధుసూధన్‌రెడ్డితోపాటు, పలువురు కమిటి సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డిని కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:

కాంట్రాక్ట్ మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని పర్మినేంట్ చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆలిండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్, భారత్, తెలంగాణ స్త్రీసేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల మహాసభలు జరిగింది. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో రోడ్లు ఊడ్చే మహిళా కాంట్రాక్ట్ కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కనీస వేతనాన్ని అందించడంతో పాటు శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర ప్రతినిధి సిరాజుద్దీన్, ఎఐటియుసి సభ్యులు, తెలంగాణ స్త్రీసేవా సంస్థ ప్రతినిధులు డాక్టర్ గురజాడ శోభాపేరిందేవి, డి.శైలజ, నీలం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# బంజారాలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

**బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్**



అభివాదం చేస్తున్న రాంచందర్‌నాయక్, కిషన్‌సింగ్, వివిధ జిల్లాల నాయకులు

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రి వర్గంలో బంజారాలకు స్థానం కల్పించాలని అలాగే ఎస్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. ఈమేరకు ఆదివారం మింట్‌కాంపౌండ్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 40లక్షలకు పైగా ఉన్న బంజారాలకు మంత్రివర్గంలో చోటులేకపోవడం బాధాకరమన్నారు. గిరిజనులను చిన్నచూపు చూస్తే భవిష్యత్‌లో తగిన ముల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. అలాగే గోర్బోలి భాషకు అధికార హోదా కల్పించాలని రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలన్నారు. అంతేకాకుండా గిరిజనులపై, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో అన్ని సంఘాలను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్ సింగ్, రాథోడ్ తారాచంద్, బాబురావు నాయక్, దీప్లాల్ చౌహాన్, ఆర్.శేఖర్ నాయక్, నారాయణ నాయక్, ఎల్.రాందాస్ నాయక్, సీతారాం నాయక్,సుమన్ రాథోడ్, చంద్రునాయక్, ప్రవీణ్‌నాయక్, పరుశురాం, గోపిచంద్ వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వంశితిలక్

## శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సిబిఐచే విచారణ జరిపించాలి: వంశీతిలక్

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవం టిటిడి శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే సిబిఐచే విచారణ జరిపించాలని మాదిగ హిందూ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డాక్టర్ టి.ఎన్.వంశతిలక్ కోరారు. లడ్డూ ప్రసాదం కల్తిపై వస్తున్న వార్తలపై కోట్లాది మంది మాదిగల మనోభావాలు దెబ్బతింటున్నాయని, కల్తికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహంకు పూల మాలవేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. దళితులను హైందవ మతం నుంచి దూరం చేయాలనే కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. తాము జాంబవంతుల వారసులమని స్పష్టం చేశారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తిరుమల శ్రీవారిపైన నమ్మకం లేదని, ఉంటే డిక్లరేషన్‌పైన సంతకం చేసి శ్రీవారిని దర్శించుకోవాని ఆయన డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కొలనుకపాలో జాంబవంతుని విగ్రహాలను రజకులు ధ్వంసం చేశారని, వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ హిందూ హక్కుల పోరాట సమితి నాయకులు చిన్న వీరయ్య, నవీన్‌కుమార్, సత్యనారాయణ, ప్రకాష్, పరుశురాం పాల్గొన్నారు.

## నేటి నుంచి కూకట్‌పల్లిలో బతుకమ్మ సంబురాలు 10వ తేదీన సద్దుల బతుకమ్మ

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సంబరాలు కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహిస్తామని కూకట్‌పల్లి బతుకమ్మ కమిటీసభ్యులు కంచనపల్లి నాగరాజు తెలిపారు. బతుకమ్మ ఉత్సవాలు కూకట్‌పల్లిలో ఈ నెల 30వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. అచ్చమైన పూలతో బతుకమ్మలను పేర్చి కూకట్‌పల్లిలో మహిళలు రాష్ట్రంలోనే అతి పెద్ద బతుకమ్మలను ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. బతుకమ్మ పండుగ కోసం మహిళలు పోటీ తత్వంతో బతుకమ్మలను తయారు చేస్తారు. ఈసారి బతుకమ్మలకు అమావాస్యకు ముందురోజు మంగళవారం రావటంతో తొలిరోజు బతుకమ్మ బొడ్డెమ్మలను బయటకు తీసుకురావద్దనే సంప్రదాయం ఉంది. దీంతో సోమవారమే బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల కోసం కూకట్‌పల్లి అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. కూకట్‌పల్లి ప్రధాన చౌరస్తా వదనద ఏర్పాటు చేసే ఈ వేడుకలకు మహిళలు భారీ ఎత్తున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 10వ తేదీన సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు.

## దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

**సైఫాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నిస్సహాయ స్థితిలో ఉన్న దివ్యాంగులను మానవతా దృక్పథంతో అదుకోవాల్సిన బాధ్యత సమాజంపై లండన్ రెవడిల్ అండ్ రిట్నర్ సంస్థ ముఖ్య ప్రతినిధి, ప్రవాస భారతీయుదు కనుకుంట్ల సత్య కోరారు. ఇప్పటికే భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ఇతరులు అదుకుంటున్నారని, అయితే మానసేవే మాధవ సేవగా భావించి అందరూ బాధ్యతగా వారిని అదుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జగ్గుగూడగ్రామానికి చెందిన దివ్యాంగులు గుడిపల్లి శంకరమ్మ, పెంటమ్మలకు ఆయన ఉచితంగా వీల్ చైర్స్ పంపిణి చేసిన సందర్బంగా మాట్లాడారు. ఒకరిపైన ఆధారపడకుండా దివ్యాంగులు జీవించడానికి కృతిమ అవయువాలను కూడా దానం చేయాని ఆయన కోరారు. ఈ సందర్బంగా పేదలకు ఆయన అన్నదానం కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ, మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, కిష్టయ్యగుప్తా, కె.సునంద్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహాల ఏర్పాటుతో పాటు పరిరక్షించుకోవాలి : బిక్షపతియాదవ్



మాట్లాడుతున్న బిజెపి శ్రేణులు

**నిజాంపేట్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** మహాత్ముల విగ్రహాల ఏర్పాటుతోపాటు పరిరక్షించుకోవలాని బిజెపి నిజాంపేట్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ అన్నారు. ఆదివారం జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహ పరిసరాలను శుభ్రపరిచి రంగులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని ఆంగ్లేయులపైన భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి ఇచ్చే గౌరవం ఇదేనా.. విగ్రహం చుట్టూ ప్లెక్సీలు పెట్టుకోవడానికా ఏర్పాటు చేసేది అని నాయకులను అధికారులను ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు గాంధీని తమవారిగా చెప్పుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు. విగ్రహాలు శిథిలావస్థకు వచ్చి ఏళ్లు గడుస్తున్న ఇక్కడున్న నాయకులు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. దీనిని గమనించిన తాము ఆదివారం మహాత్మాగాంధీ విగ్రహానికి రంగులు దిద్దడం జరిగిందన్నారు. గాంధీ జయంతికి వచ్చి విగ్రహాలకు పూలమాలలే వేయడమే కాదు విగ్రహాలను పరిరక్షించి వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. త్వరలోనే భారతదేశం యొక్క ఔనత్యాన్ని మన సనాతన ధర్మాన్ని విశ్వవ్యాపనతం చేసి తన యొక్క సూక్తులు, కొటేషన్ల ద్వారా యువతలో నిత్యం స్ఫూర్తిని నింపుతున్న స్వామి వివేకానంద, అలాగే హిందూ సామ్రాజ్య వ్యాప్తికి తన ఖడ్గంతోనే సమాధానం చెప్పిన సామ్రాట్ శివాజీ మహారాజ్ విగ్రహాలను హిందూ బంధువుల అందరి సహాయ సహకారాలతో విగ్రహాలను ఏర్పాటు చేసి వారి యొక్క స్ఫూర్తిని భావితరాలకు అందజేయడంలో ఆ విగ్రహాలను పరిరక్షిస్తా మని తెలిపారు. కార్యక్రమంలో దాసి నాగరాజు, సచిన్, శ్రీనివాస్ గుప్తా, సతీష్‌కృష్ణ, వెంకటేష్ ముదిరాజ్, మల్లేష్, కూన ప్రసాద్, గంగాధర్ =పాల్గొన్నారు.

## విజయ డెయిరీ నెయ్యినే వినియోగిస్తున్నాం

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ఇటీవల తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిపై వివాదం నెలకొన్న తరుణంలో చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారి కె.రామాంజనేయులు స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఇచ్చిన ఆదేశాలు, ఉత్తర్వులకు పూర్వమే తమ దేవాలయంలో ప్రసాదాల తయారీకి విజయ డెయిరీ నెయ్యినే వినియోగిస్తున్నామన్నారు. నెయ్యికి ప్రైవేట్ సంస్థల ప్రభావం లేకుండా ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేస్తున్నామని. ఇకపై టెండర్లతో పనిలేకుండా నేరుగా విజయ డెయిరీ నుంచే కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోని విజయ డెయిరీ ఉత్పత్తి చేసే నెయ్యిని వాడుతున్నామని, ఆలయానికి వచ్చే భక్తులు ఇందులో ఎటువంటి సందేహాలు, అనుమానాలు వద్దని, తమ వద్ద ప్రసాదాలలో ఎట్టి కల్తీకి ఆస్కారం లేదని స్పష్టం చేశారు.

## నేడు శ్రీమద్భగవద్గీత అష్టావధానం

**జీడిమెట్ల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త :** భావి తరాలకు మన సంస్కృతి సాంప్రధాయాలను తెలియజేయాలనే సదుద్దేశ్యంతో నా ఫౌండేషన్ ఆధ్వరనయంలో సత్ జ్ఞాన్ హై స్కూల్ సౌజన్యంతో స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అధ్యక్షత వహిస్తుతున్న ఈ కార్యక్రమంలో అష్టావధాని, ప్రవచన కర్త యర్రంశెట్టి ఉమామహేశ్వరరావుచే నేడు కుత్బుల్లాపూర్‌లోని సత్ జ్ఞాన్ హై స్కూల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు భగవద్గీత అవధానం ఏర్పాటు చేసినట్లు నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కార్యక్రమం నిర్వాహకులు గోగుల పాటి కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఈ అవధానంలో పదవతరగతిలోపు చదివే విద్యార్థులు ప్రేక్షకులుగా పాల్గొని అవధానిని భగవద్గీతలోని అంశా లను ప్రశ్నించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ భగవద్గీత అవధానంలో ఎనిమిది అంశాలు ఉంటాయని వాటి వివరాలను

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

**కేశంపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంతాపూర్ గ్రామంలో ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలని మరియు ఆదర్శవంతమైన గ్రామంగా తర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు ఎంపిటిసి పెద్దలు యువకుల ఆలోచన మేరకు ఆదివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో యోగా కార్యక్రమాన్ని ప్రారంబించారు. పతాంజలి యోగ సమితి ప్రచారక్త ఏ సత్తయ్య హాజరై మాట్లాడారు. యోగా ఆసనాల అభ్యాసం బలం మరియు వశ్యతన అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ అంజయ్య మరియు మాజీ ఉపసర్పంచ్ మరియు మాజీ ఉపసర్పంచ్ యాదయ్య మాజీ ఎంపిటిసి రాజు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేశంపేటలో మాన్‌కి బాత్ కార్యక్రమం

**కేశంపేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాన్‌కీ బాత్ కార్యక్రమాన్ని కేశంపేట మండల అధ్యక్షుడు రోళ్ల రుఘురాం గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం మాన్‌కిబాత్ కార్యక్రమాన్ని బిజెపి నాయ కులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రొల్లు రఘురాంగౌడ్ మండల ఉపాధ్యక్షుడు కంచుకోట నర్సింలు పాండురంగారెడ్డి మండల నాయకులు బైరామోని మల్లేష్ బూత్ అధ్యక్షుడు దొబ్బల శ్రీనివాస్ ఆర్‌కె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసమే పుట్టింది చారిటబుల్ ట్రస్టు

### మృతుల కుటుంబాలకు రూ. 30 వేల ఆర్థికసాయ



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

**కడ్తాల్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** కష్టకాలంలో పేద ప్రజలను ఆదుకోవడం కోసమే జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు పుట్టిందని ట్రస్టు ఛైర్మన్, మాజీ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పేదోడి కోసం ట్రస్టు సేవలు యధావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఆదివారం కడ్తాల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కడ్తాల్ గ్రామానికి చెందిన చిలివేరు జంగమ్మ, సలార్పూర్ గ్రామానికి చెందిన కావలి చెన్నమ్మ, కర్రె శివమ్మ, సాయిలు, చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పంపుగూడ గ్రామానికి చెందిన పోతుగంటి బీమయ్య, గొర్ల కిష్టయ్యల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి ఆనంద్, మాజీ ఎంపిటిసిలు ప్రియా రమేష్, సాయిలు, మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, గ్రామ రైతు సమితి సభ్యులు మంగళపల్లి నరసింహ, మాజీ ఏఎంసి డైరెక్టర్ లాయక్ అలీ, నాయకులు పంతునాయక్, బాబాచందు, వెంకటేష్, జైనాల్, గోపాల్, నరేష్, ప్రకాష్, కృష్ణయ్య, మాధవులు, కర్ణాకర్ రాజు, కుమార్, రాజేందర్, శ్రీధర్, అర్జున్, రమేష్,సాయిలు నాయకులు పాల్గొన్నారు.

## శ్వాసక్రియలోని రహస్యం సాధన ద్వారానే సాధ్యం

### ది ఆర్ట్ ఆప్ లివింగ్ టీచర్స్ టీచర్స్ శ్రీనివాస్‌రావు, శిల్ప



హ్యాపినెస్ ప్రోగ్రాంలో టీచర్స్‌తో పాటు పాల్గొన్న సభ్యులు

**తాండూరు టౌన్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** సుదర్శన క్రియతో ప్రశాంతమైన మనసు, శారీరక ఆరోగ్యంతో కూడిన నవ్య వికసిత జీవనం లభిస్తుందని, శ్వాస క్రియలోని రహస్యం సాధన ద్వారానే సాధ్యమని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ శ్రీనివాస్‌రావు, శిల్ప అన్నారు. ఆర్గనైజర్స్ హరి, వీరేందర్‌అధ్వర్యంలో తాండూరు పట్టణంలోని గంజ్ అసోసియేషన్‌లో గత నాలుగు రోజుల నుంచి ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ( జీవనకళ) హ్యాపినెస్ కార్యక్రమంనిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో టీచర్స్ శ్రీనివాస్‌రావు, శిల్ప మాట్లాడుతూ యోగా, ప్రాణయామం, ధ్యానం ద్వారాఒత్తిడి తొలగి శాంతి మయ ప్రశాంత చిత్తాన్ని పొందుతారని అన్నారు. మానసిక బలహీనత, ఒత్తిడి, ఆతృత, చింతల నుంచి విముక్తి లభిస్తుందనిఅన్నారు. ఇనుమడించే ధైర్యం,రెట్టించిన ఉత్సాహం భాధ్యత, ఏకాగ్రతలు పెరుగుతాయిని అన్నారు. శారీరక బలంతో పాటు పరస్పర సంబంధాలను మెరుగుపురుచుకోగలిగిన నేర్పును పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ హ్యాపినెస్ ప్రోగ్రాం ద్వారా ఎంతో ప్రశాంతత పొందామని, తద్వారా జీవనకళలను సాకారం చేసుకునేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** అప్పులబాధ తట్టుకోలేక ఓవ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిదిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య ఎన్ఎఫ్ సీనగర్ సమీపంలో ఓ వ్యక్తి రైలుకు అడ్డంగా వెళ్లడంతో ఢీకొట్టగా అక్కడి కక్కడే మృతిచెందాడు. కర్నాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన జగన్నాథ్ పీర్జాదిగూడ ఎంపీ మేడిపల్లిలో ఉంటూ మక్కబుట్టలు అమ్ముకునేవాడు. అతనికి భార్య ఐదుమంది పిల్లలు ఉండగా పెద్ద కూతురు వివాహం చేయడా నికి అప్పులు చేశాడు. ఆదాయానికి మించిన అప్పులు పెరిగిపోవడంతో మక్కబుట్టలు అమ్మిన డబ్బులు కుటుంబపోషణకు సరిపోక తీవ్ర మనోవేధనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఘట్‌కేసర్ సమీపంలో రైలు పట్టాల వద్దకు వెళ్లి రైలు రాకను చూసి ఎదురుగా వెళ్లగా తీవ్ర గయాలై అక్క డికక్కడే మృతిచెందాడు. ఈమేరకు జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరు కొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ సుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## జిల్లా స్థాయిలో మండల విద్యార్థుల ప్రతిభ

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా సాంస్కృతిక ఉత్సవాలలో ఉత్తమ ప్రతిభను కనభర్చారు సోలో ఫోక్ డ్యాన్స్ విభాగంలో ప్రథమ,ద్వితీయ విజేతలుగా ప్రేమ జ్యోతి,కె.జ్యోతిలు గెలుపొందారు. సోలో ఫోప్ సింగింగ్ విభాగంలో సుమలత, ఏక పాత్రాభినయంతో నాటకంలో బానులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వేణుమాధవ్ ప్రదర్శిచిన మిమిక్రి కళ, పాటలు అందిరిని ఆకట్టుకున్నాయి. విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ శశిధర్ అభినందించారు.

## మహిళలు అన్నిరంగాలలో రాణించాలి

### సినీనటి మానసా చౌదరి

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని దానికి బాల్యంలోనే పటిష్టమైన పునాది పడాలని సినీనటి మానసా చౌదరి తెలిపారు. బిల్డింగ్ బ్లాగ్రూప్ ఆధ్వర్యంలో బంగారు తల్లి 467వ టాలెంట్ ఫ్యాక్టరీ ఈ వెంట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికా సాధికారతకు బిబిజి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ సహకారంతో బాలికలు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు.

## అక్టోబర్ 4 నుంచి క్రికెట్ టోర్నమెంటు

**పెద్దేముల్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** అక్టోబర్ 4వ తేది నుంచి చిట్టెపు ప్రకాష్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించనట్లుఆర్గనైజర్స్ సి,వెంకటేష్, యండి.మతిన్, ఏ,అఖిల్, తన్వీర్‌లు తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మండల లేవెల్‌లో నిర్వహించే క్రికెట్ టోర్నమెంటులో ఎంట్రి ఫీజు లేదని, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆప్ ది సిరిస్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బోలర్ ఇవ్వబడుననిఅన్నారు. మొదటి బహుమతి రూ.21 వేలు కప్, రెండవ బహుమతి రూ.11 వేలు కప్ నిర్ణయించనైనదని అన్నారు. పోటిలో పాల్గొనే ఆటగాళ్ళందరికికప్స్ ఇవ్వబదునని, అక్టోబర్ 3న సాయంత్రం 4 గంటలకు డ్రా తీయబడుతుందని అంపైర్స్‌దే తుదినిర్ణయమని అన్నారు. వెంకటేష్ 9966952810, యండి.మతిన్ 8897812876 పోన్ నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

## విద్యార్థుల కోసం పోరాడితే అరెస్టులు చేయడం బాధకరం

### ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

**షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబరు29, (ప్రభాతవార్త) :** పేద విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం వారి పక్షణ ఇంద్ర పార్కు వద్ద నిరసన తెలిపే కార్యక్రమం చేపడితే తమ నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడాన్ని షాదనగర్ ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఒక ప్రకటన విడుదల చేవారు. పేద విద్యార్థుల చదువుకై పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ విషయమై ఈ నెల 27న తమ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపడితే అక్రమ అరెస్టులు చేపడుతారా అని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని పరిశీలించారు. పెట్టిన కేసులు వెంటనే విరామించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సహితం ఇదేవిధంగా విద్యార్థులపై, విద్యార్థి నాయకులపై కేసులు పెడితే వారికి తగిన గుణపాఠం చెప్పామని, ఇదేవిధంగా ఈ ప్రభుత్వం చేస్తే ఆ ప్రభుత్వానికి సహితం తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయకపోతే మరిన్ని ఉద్యమాలు చూడాల్సి వస్తుందని వారు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకటన విడుదల చేసి వారిలో ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు సుమయిర్, శివశంకర్, వినయ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దినచర్య, ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యం

### ప్రముఖ తెనాలి నాడి వైద్యుడు మారుతి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, సెప్టెంబరు 29 :** ప్రస్తుతం సమాజంలో దినచర్య, ఆహ ఆహారపు అలవాట్లు ఎంతో ముఖ్యమని వాటితో మన జీవన విధాన శైలిని మెరుగుపరుచుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని తెనాలికి చెందిన ప్రముఖ నాడీ వైద్యులు మారుతి తెలిపారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో స్థానిక నాడీ వైద్యులు రవి చికిత్స కేంద్రంలో మారుతి పలువురిని ఉచితంగా పరీక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కేపీ తదితరులు నాడీ వైద్యులు మారుతి, రవిలను శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాడీ వైద్యులు మారుతి, రవిలు మాట్లాడుతూ నాడీ పరీక్ష ప్రాచీణ భారతీయ పరీక్షా విధానమని ఇది ఆయుర్వేదంలోని అష్టస్థాన పరీక్షలలో ఒక పరీక్షా విధానమని, ఆయుర్వేదంలో ఎప్పుడు కూడా రోగ నిర్ధారణ వైద్యుడు రోగిని పూర్తిగా పరిశీలించిన తర్వాత జరుగుతుందన్నారు. వైద్యుడు రోగి యొక్క అంతర్గత, భౌతిక, శారీరక లక్షణాలను, మానసిక స్థితి, స్వభావాలను శ్రద్ధగా గుర్తిసాడని, రోగికి సంబంధించిన ఇతర అంశాలను శరీరం ప్రభావితం కాబడిన ధాతువులు, కణజాలం, రసాలు, రోగం కేంద్రీకృతమైన చోటు, రోగి నిగ్రహం, తట్టుకునే శక్తి, అతని దినచర్య, ఆహారపు అలవాట్లు, చికిత్స సంబంధిత పరిస్థితుల ప్రాధాన్యత వల్ల కలిగే ప్రభావం, జీర్ణ పరిస్థితులు, రోగి యొక్క వ్యక్తిగత, సాంఘీక, ఆర్థిక, పర్యావరణం సంబంధిత పరిస్థితి అనే అంశాలను కూడా అధ్యయనం చేయగలరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖరప్ప, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు కృషి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలో ప్రజాప్రతినిధులు విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు బస్‌పాస్ సర్వీస్‌చార్జ్ చెల్లించి అందించారు. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, చైర్‌పర్సన్ పావనియాదవ్‌ల చేతుల మీదుగా పిల్లలకు పాసులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కడుపొల్ల మల్లేశ్, బత్తుల నరేశ్‌యాదవ్, సహకార సంఘం డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్‌సభ్యులు ఎస్‌కె. శౌకత్ మియా, ఆర్టీసీ అధికారి రాజబోయిన రాంచందర్, కాంగ్రెస్ ప్రధానకార్య దర్శి బర్ల రాధాకృష్ణ, ఇడబ్ల్యుఎస్‌కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయు లు, కార్యదర్శి శశిధరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయ కులు అశ్రాఫ్‌ఆలీ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** వెంకటాపూర్ అనురాగ్ విశ్వవిద్యాల యంలో నూతన ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక నిర్వహించారు. 2(టి)ఎయిర్ ఎస్ క్యుఎన్(టెక్) ఎన్‌సీసీ వారి ఎన్‌సీసీ యూనిట్ సికింద్రాబాద్ ద్వారా కొత్త ఎన్‌సీసీ క్యాడెట్ల నిర్వహించింది. కమాండింగ్ ఆఫీసర్ గ్రూప్ క్యాప్టన్ వర్మా గోఖలే, జేడబ్ల్యుఓ వినయ్‌సింగ్, ఎస్‌జిటి రాణా, సీపీఎల్ సౌరవ్‌డే, సీపీఎల్ సరజిత్ దేబ్‌నాథ్, ఎన్‌సీసీ అనురాగ్ యూనివర్సిటీ హెడ్ డాక్టర్ చెన్నకేశ్ మల్లేశ, సీటీఓ సౌరబ్‌బర్బుటే తదితరులు పాల్గొన్నారు.

## హరినాథ్‌రెడ్డికి నాయకుల నివాళులు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** హరినాథ్‌రెడ్డి అందించిన సేవలు మరువలేనివని మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. చౌదరిగూడ సింగారం చౌరస్తాలో ఎఫ్‌డిసీ మాజీ డైరక్టర్ స్వర్గీయ మన్నెం హరినాథ్‌రెడ్డి 17వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా మహేశ్‌గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, ఆయన కుటుంబసభ్యులు హరినా థ్‌రెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. ఘట్‌కేసర్ మండలాభివృద్ధికి, కాంగ్రెస్‌పార్టీ కోసం హరినాథ్‌రెడ్డి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచులు బద్దం గోపాల్‌రెడ్డి, బైనగారి నాగరాజు, మాజీ ఎంపిటిసి పులకంటి భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తల్లి కమలమ్మ, సతీమణి ఉమారాణి, మాజీ వార్డు సభ్యులు రడమల్ల బోజిరెడ్డి, నానవత్ సురేశ్‌నాయక్, గుర్జకుంట నర్సింహ్మ, చౌదరి గూడ కాంగ్రెస్ అధ్యక్షులు కట్ట అంజనేయులుగౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశపావుల వినోద్‌కుమార్, నాయకులు బండ్లగూడెం నాగే శ్‌గౌడ్, సిద్దగోని నర్సింహ్మాగౌడ్, పులకంటి రాజశేఖర్‌రెడ్డి, శ్రీమంత్‌రెడ్డి, బా షగళ్ల విజయ్‌గౌడ్, నాగులపల్లి శ్రీనివాస్, మాలో సైదానాయక్ పాల్గొన్నారు.

## కార్మికులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** పారిశుద్య పనుల విధులు నిర్వహించే కార్మికులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ ఎండి.సాబేర్‌ఆలీలు సూచించారు. ఘట్‌కేసర్‌లోని డ్వాక్రా భవనంలో సచ్చతాహిసేవ కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్, కమీషనర్‌లె కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఘట్‌కేసర్ పట్టణం ఆరోగ్యంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. విధి నిర్వహణలో తప్పకుండా హాండ్‌గ్లోవ్స్, అప్రోన్, ఫేస్‌మాస్కులు ధరించాలని పనిముట్లు వాడే విధానంలో అవగాహన కల్గి ఉండి పనిచేయాలని సూచించారు. ఈసమావేశంలో పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, మెప్మా సీఓ యోగేశ్వర్, నాయకులు సిరాజుద్దిన్ పాల్గొన్నారు.

### నేడే కొత్తపల్లిలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం

**పాపన్నపేట,సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గార్డెన్‌లో ఈ నెల 30వ తేదిన మాదిగల ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు, దళిత రత్న అల్లారం రత్నయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరవుతారని ఆయన తెలిపారు.

## మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, సెప్టెంబరు 29 :** రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయనను కలుసుకొని పరామర్శించారు. ఈ సందర్బంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి భౌతికఖాయం వద్ద నివాళులు అర్పించారు. మంత్రి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

## రవాణా రంగాన్ని రక్షించండి

### లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ సాదిక్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, సెప్టెంబరు 29 :** గత రెండు నెలలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో వర్షాలతో రవాణా రంగం కుదేలైందని, దీనికి తోడు రవాణా రంగాన్ని అనేక సమస్యలు కుదిపేస్తున్నాయని తెలంగాణ లారీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని స్టార్ ట్రాన్స్ పోర్ట్ కంపెనీ నిర్వాహకుడు సయ్యద్ సాదిక్ ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తపల్లిలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి అనేక తీర్మాణాలు చేసినట్లు ఆయన తెలిపారు. దీనికోసం లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు సయ్యద్ సాదిక్, అసోసియేషన్ నేతలు నవాజ్‌గోరీ, మొహమ్మద్ ఫయాజ్, మహమ్మద్ షబ్బీర్ తదితరులు హాజరై సమావేశంలో పాల్గొనట్లు తెలిపారు. ఈ సందర్భంగా రవాణా రంగానికి సంబంధించిన సమస్యలను సయ్యద్ సాదిక్ స్థానిక మీడియాకు వివరించారు. గత రెండు నెలలుగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల వవల్ల రవాణా రంగం కిరాయిలు లేక అష్టకష్టాల పాలైందన్నారు. దీనికి తోడు లారీలపై విధిస్తున్న పలు రకాల పన్నులు వెంటనే మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్లు తెలిపారు. డీజిల్ ధరల తగ్గింపు పేరిట అనేక సందర్భాల్లో ధరలు పెంచి రవాణా రంగాన్ని పూర్తిగా కుదేలు చేస్తున్నారని, వెంటనే డీజిల్ ధరలు తగ్గించాలని తీర్మాణించినట్లు తెలిపారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న సింగిల్ పర్మిట్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని, గత 15 సంవత్సరాలుగా ఫిట్‌నెస్, గ్రీన్ టాక్స్ ప్రభుత్వం పెద్ద మొత్తంలో వసూలు చేస్తుందని, అలాంటి చలానాలు పూర్తిగా తగ్గించాలని తీర్మాణించినట్లు తెలిపారు. ప్రకృతి వైపరిత్యాలకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఏవిధంగా అయితే ఆదుకుంటుందో, అదేవిధంగా ఈ వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న లారీలను వెంటనే ప్రభుత్వమే మరమ్మతులు చేయించాలని కోరారు. ప్రభుత్వం రైతుల నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యం విషయంలో స్థానిక లారీలకు న్యాయం చేయాలని తీర్మాణించినట్లు వెల్లడించారు. పాత వాహనాలు రద్దు గురించి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవో పట్ల రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఈ అంశం సుప్రీంకోర్టులో ఉందని, దీనిపై ప్రభుత్వం ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సమావేశంలో తీర్మాణించినట్లు సయ్యద్ సాదిక్ తెలిపారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు దాత తాండ్ర కాశీనాథ్ రెడ్డి లక్ష విరాళం



కాశీనాథ్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆయన కమిటీ సభ్యులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (సెప్టెంబరు 29) :** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శ్రీ అంబ భవానీ మాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబరు 3 నుండి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆదివారం షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర కాశీనాథ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ రెడ్డి నవరాత్రి ఉత్సవాలకు తనవంతుగా లక్ష రూపాయల గ్రామపెద్దలకు అందజేశారు. అమ్మవారి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తాండ్ర కాశీనాథ్ రెడ్డి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబ భవానీ మాత దేవాలయ కమిటీ చైర్మన్ నారం దినేష్ రెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, ఆర్ల యాదయ్య యాదవ్, గున్న కృష్ణ యాదవ్, కావలి శ్రీశైలం, రాజు, నారం శ్రీపాద రెడ్డి, శివ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల, క్రమశిక్షణతో ఉంటే అన్నింటా విజయం

**శామీర్‌పేట, సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

పట్టుదల, క్రమశిక్షణతో అన్నింటా విజయం సాధించవచ్చని, నిత్య విద్యార్థిగా ఉంటూ లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలని ప్లెక్సీ క్లౌడ్ సిఇఓ సహ వ్యవస్థాపకురాలు అనూజా బషీర్ సూచించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీలోని విశ్వవిశ్వాని ఇన్‌స్టూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల స్నాతకోత్సవ కార్యక్రమం జరిగిం ది. ఈ సందర్భంగ ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జీవితంలో లక్ష్య సాధనకు ప్రణాళికలను రూపొందించుకుని వెళ్లితే విజయం సాధిస్తారని అన్నారు. విద్యార్థులు నిత్య విద్యార్థిగా కొనసాగితే అనుకున్న లక్ష్యాలను సకాలంలో సాధిస్తారన్నారు. టెక్ మహేంద్ర వైస్‌ప్రసిడెంట్ పునీత్ గుప్తా మాట్లాడుతూ విశ్వవిశ్వాని కళాశాలలో అభ్య సించిన విద్యను ఎంచుకున్న రంగాలలో విజయాన్ని సాధిం చవచ్చని అన్నారు. ఎంచుకున్న రంగంలో నైపుణ్యంను పెంచుకుని విజయాలను పొందటానికి వినియోగించు కోవాలని సూచించారు. విద్యార్థులు అయినా, ఉద్యోగులైన వైఫల్యాల నుంచి విజయానికి బాటలు వేసుకోవటం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయశ్రీ వెలుతక్కల్, కళాశాల అధ్యక్షులు జీఎస్ఎస్‌వెంకటేశ్వరరావు, డైరక్టర్ డాక్టర్ లక్ష్మణకుమార్‌లు ప్రసంగించారు. పలు విభాగాల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బంగారు పతకాలను అతిథితులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో ముందుగా 2022-2024విద్యా సంవత్సరం పిజిడిఎం బ్యాచ్ పట్టభద్రులకు పట్టాలను అందజేశారు.

## ట్యాంకర్ నుంచి పెట్రోల్ చోరీ..కేసు నమోదు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ట్యాంకర్ నుంచి పెట్రోల్ దొంగ లించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. అవుషాపూర్ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా బీపీసీఎల్ పెట్రోల్ బంకు వెనకాల ఖాళీ స్థలంలో ట్యాంకర్ (టిఎస్08యు-కె2529) నుంచి పెట్రోల్ తీస్తుండగా గమనించిన పోలీసులు డ్రైవర్‌ను పట్టుకున్నారు. కల్వకుర్తికి చెందిన రాములు (30) ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా పెట్రోల్ చోరీ చేసి బయట విక్రయించాడు. ట్యాంకర్ పైకప్పులో పైపు వేసి 20 లీటర్ల సామర్థ్యం కల్గిన రెండు క్యాన్లలో పెట్రోల్‌ను దొంగలించాడు. దీంతో విచారణ జరిపి కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు.

## అక్రమ గ్యాస్ ఫిల్లింగ్‌పై కేసు నమోదు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్దంగా గ్యాస్ నింపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బాలాజీనగర్‌లో ఉంటున్న అబ్దుల్ అజీజ్ తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పెద్ద డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల నుంచి చిన్న గ్యాస్ సిలిండర్లకు గ్యాస్ రీఫిలింగ్ చేస్తూ అధిక ధరకు అమ్ముతున్నాడు. ఈమేరకు విచారరణ జరిపిన పోలీసులు పంచనామా నిర్వహించి సిలిండర్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ సైదులు తెలిపారు.



## మృతుడి కుంటుబానికి ఆర్థిక సాయం అందజేత

**తలకొండపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల మహేష్ అనే యవకుడు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ కా ంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ మాజీసర్పంచ్ ఎన్నం వరలక్ష్మి రాజేంద్‌రెడ్డి ఆదివా రం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వెంటనే తక్ష ణ సాయంగా 100 కిలోల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అం దించారు. ఈ కార్యక్రమంలో కాకి సాలయ్య మీసాల రాములు మీసాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



**తలకొండపల్లి, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా తలకొం డపల్లి మండల పరిధిలోని పెద్దూరు తండా గ్రామంలో మేఘవత్ హర్య అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. తండా నాయకుల ద్వారా దేవుని పడకల్ (పెద్దూరు) మాజీ ఎంపిటిసి మూడవత్ రఘునాయక్ ఉప్పల చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్, మాజీ రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌కు తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించిన జెడ్పిటిసి ఉప్పలవెంకటేష్ బాధిత కుంటుబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ట్రస్టు ద్వారా 3000 వేల రూపాల యాల ఆర్థిక సాయం కుటుంబానికి అందజేశారు. ఈకార్యక్రమలో దేవుని పడకల్ మాజీ ఎంపిటిసి సభ్యుడు మూడావత్ రఘు నాయక్ గ్రామ పెద్దలు పడకల్ మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ కేతావత్ టీక్యనా యక్ మాజీ ఉపసర్పంచ్ దేవి నరేష్ మాజీ వార్డు మెంబర్ కేతావత్ పుల్యి మోడవత్ చందర్‌నాయక్ కేతావత్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-99లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు 25 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. 25 ఏండ్ల తరువాత స్నేహితులంత ఒక్కచోట కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవదులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా వారికి చదువు చెప్పిన గురువులు కొప్పు జంగయ్య, కె.శ్రీనివాసులు, పొగాకు సురేష్‌లను పిలుచుకొని ఘనంగా సన్మానించారు.ఈ సమ్మేళనానికి ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వల్ప,దీర్ఘకాలిక రుణాల మంజూరీపై సభ్యుల తీర్మాణాలు

### పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ అద్యక్షులు శివకుమార్‌గుప్త

**కొడంగల్,సెప్టెంబరు 29ప్రభాతవార్త** పీఏసీఎస్ ద్వారా రైతులకు స్వల్పకాలిక, ధీర్ఘకాలిక రుణాల మంజూరీపై సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణించారు.ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం హస్నాబాద్(కొడంగల్) కార్యాలయంలో ఆదివారం పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త అధ్యక్షతన సంఘం మహాజన సభ సమావేశం నిర్వహించారు.సమావేశంలో సంఘం జమా,ఖర్చులను సభ్యులు అమోదించారు.అలాగే సంఘం ఆవరణలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని,స్వల్పకాలిక,ధీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలని అలాగే అసైన్డ్ భూములకు రుణాలు ఇచ్చేందుకు ఎండీసీసీబీ అధ్యక్షులు,సీఈఓలకు విజ్ఞప్తి చేయాలని సంఘం కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణించారు.ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు కొల్లూరు నారాయణ,నర్సా నాయక్,ముదేళి రాఘవేందర్‌రెడ్డి, చిదిరి వినోద్‌కుమార్,దత్తురెడ్డి,గతుప బుగ్గప్ప,బంటు పకీరప్ప,మాల రామప్ప, గొల్ల ఎల్లమ్మ,మాల సాయమ్మ పాల్గొన్నారు.

## ప్రమాదశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి

**కొడంగల్,సెప్టెంబరు 29ప్రభాతవార్త** చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందిన సంఘటన గుండ్లకుంట గ్రామంలో చోటుచేసుకుంది.సంఘటనకు సంభదించి హెడ్‌కానిస్టేబుల్ శివరా ములుగౌడ్ కథనం మేరకు..గుండ్లకుంటకు చెందిన తెలుగు కులానికి చెందిన మాలల ఉషప్ప(48) శనివారం రాత్రి సమయంలో ఎవరికి తెలియకుండా హస్నాబాద్ చెరువులోకి రహస్యంగా చేపలు పట్టేందుకు వెళ్ళాడు.చెరువులో చేపలు పడుతున్న క్రమంలో అకస్మాత్తుగా చెరువు లోతులోకి చేరుకొని ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు.సంఘటనపై మృతుని భార్య ఫిర్యాదు మేరకు సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదేశానుసారం కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్న ట్లు హెడ్‌కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపారు.

## క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**కొడంగల్,సెప్టెంబరు 29ప్రభాతవార్త** కొడంగల్ పట్టణంలోని మక్కా మసీదులో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.మైనార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం.గౌసన్ అద్వర్యంలో ఆదివారం మక్కా మసీదులో నాతే షరీఫ్ అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్దులకు మసీదు కమిటీ సభ్యులు బహుమతులు అందించారు.కార్యక్రమంలో హఫీజ్ అబ్దుల్ రషీద్,కరీం,షేక్ ఆదిల్,మక్సూద్,అసీఫ్‌ఖాన్,వాహెద్,అబ్దుల్ రహీం,సయ్యద్ మునీర్,అజిమ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత

**చిన్నశంకరంపేట,సెప్టెంబరు 29,ప్రభాతవార్త:** మండల పరిధి రుద్రారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గొల్ల కుమార్ శనివారం నాడు చనిపోగా ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు 7వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని పంపగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం నాడు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

# ముంచుకొస్తున్న నిమోనియా ముప్పు

- ఆసుపత్రుల్లో పెరుగుతున్న చిన్నారులు
- ప్రతి 10 మంది పిల్లల్లో నలుగురికి నిమోనియా
- పిల్లల్లో రోగ నిరోధకశక్తి పెంచాలంటున్న నిపుణులు





డాక్టర్ మంచుకొండ రంగయ్య

**హైదరాబాద్ సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నగరంలో చిన్నపిల్లల్లో వేగంగా వ్యాధులు తీవ్రంగా ప్రబలుతున్నాయి. ప్రతి 10 మంది పిల్లల్లో నలుగురికి నిమోనియా వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో నీలోఫర్ ఆసుపత్రికి తాకిడి ఎక్కువైంది. తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నపిల్లల్లో వేగంగా వ్యాపించే అంటువ్యాధి నిమోనియా. చిన్న పిల్లల్లో జలుబు చేస్తే న్యూమోనియా వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఐదేండ్లలోపు చిన్నారుల్లో సంభవిస్తున్న మరణాల్లో 20శాతం కేవలం న్యూమోనియా కారణంగానే చినిపోతున్నారని జరుగుతున్న సంఘటనలు, వైద్యులు ఇచ్చే నివేదికలు తెలుపుతున్నాయి. నీలోఫర్ ఆసుపత్రికి నిమోనియాతో వచ్చే పిల్లల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. చలికాలంలో ఈ వ్యాధి మరింత విస్తరించే అవకాశం ఉంది. నిమోనియా వ్యాధి ప్రతి సంవత్సరం సుమారు నాలుగు లక్షల మంది చిన్నారులను ఈ వ్యాధి కబళిస్తోంది. ఏటా 45 కోట్ల మంది ఈ వ్యాధిబారిన పడుతున్నారు. వీరిలో 40 లక్షల మంది మృతి చెందుతున్నారు. మృతుల్లో చిన్నపిల్లలు 16 లక్షల మంది వరకు ఉంటున్నారు. ప్రతి నిమిషానికి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు 100 మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ప్రతి గంటకు 50 మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఇదే అతిపెద్ద ప్రాణాంతక వ్యాధిగా తయారైంది. చిన్నపిల్లల్లో జలుబు చేస్తే న్యూమోనియా సోకే ప్రమాదం అధికంగా ఉంది. ఈ వ్యాధి సోకిందంటే పిల్లలు శ్వాస తీసుకోవడానికి అనేక ఇబ్బందులు పడతారని, వారిలో ఆయాసం ఎక్కువగా కనిపిస్తోంది. చల్లగాలి తగిలినా, చల్లని పదార్థాలు తీసుకున్నా నిమోనియా లక్షణాలు బయటపడతాయి. ఈ వ్యాధి సాధారణంగా వర్షాకాలం, శీతాకాలంలో ప్రబలుతోంది. ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరడం వల్ల తీవ్రమైన దగ్గు.. దుర్వాసనతో కూడిన కఫం, సక్రమంగా ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి. ఈ వ్యాధి ముదిరితే మరింత ప్రమాదకరం. కొంతమందికి అస్తమా తీవ్రరూపం దాల్చి నిమోనియాగా మారుతుంది. ఊపిరితిత్తుల చుట్టూ వ్యర్థాలు చేరిపోయి, బ్యాక్టీరియా పెరగడం వల్ల న్యూమోనియా వస్తుంది.

**నీలోఫర్ ఆసుపత్రికి పెరుగుతున్న రోగులు..**

నీలోఫర్ ఆసుపత్రికి నిమోనియా వ్యాధితో బాధపడుతున్న వారి చేరికతో కిటకిటలాడుతోంది. పిల్లల సంఖ్య పెరుగుతుండడంతో సంఖ్య కాస్తా 60 శాతంగా ఉంది. అత్యవసరమైన పిల్లలకు ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం న్యూమోనియా పిల్లలకు త్వరగా వచ్చే అవకాశాలు అధికంగా ఉందని, తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆర్‌సివీ వల్ల నిమోనియా వస్తుంది. సైఫ్టోకోకస్ బ్యాక్టీరియాతోనూ ఈ వ్యాధి సంక్రమిస్తుంది. నిమోనియా రెండు రకాలున్నాయి. వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు నిమోనియా వస్తుంది. దీన్ని కమ్యునిటీ అక్వైర్డ్ నిమోనియా అంటారు. రెస్పిరేటరీ పిన్ననషియల్ వైరస్ రైవోవైరస్, ఇన్ఫ్లూయెంజా వైరస్ దీనికి కారణం. ఇతర వ్యాధుల చికిత్స కోసం ఆసుపత్రులలో అత్యధికకాలం ఉన్నవారిలో వచ్చే నిమోనియా హాస్పిటల్ అక్వైర్డ్ న్యూమోనియా అంటారు.

**నిమోనియా వ్యాధిపై అవగాహన అవసరం**

**డాక్టర్ మంచుకొండ రంగయ్య**

నిమోనియా వ్యాధిపై ప్రజల్లో సరైన అవగాహన లేదని ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, విద్యానగర్‌లోని న్యూయో బీబీసీ చిల్డ్రన్ హాస్పిటల్ ఎండి డాక్టర్ మంచుకొండ రంగయ్య తెలిపారు. ఈ వ్యాధి తీవ్రతకు గుర్తించి ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించినట్లయితే లక్షలాది మంది పిల్లల్ని కాపాడుకోవచ్చునని, న్యూమోనియా వ్యాధి విషయంలో ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోకపోవడం, వ్యాధికి గురైన తర్వాత సరైన సమయంలో వైద్యం అందకపోవడం కారణంగా పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని, దేశంలో నిమోనియా భారినపడి చనిపోతున్న పిల్లలంతా ఐదేండ్లలోపు వారే కావడం మరింత విషాదమని, ఈ మధ్య కాలంలోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్ఓ), యూనిసెఫ్‌లు ఆందోళన వ్యక్తం చేశాయని అన్నారు. శ్వాసక్రియలో అత్యంత కీలకమైన ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు గురికావడమే నిమోనియా అంటు వ్యాధి అని, ఇన్ఫ్లూయెంజా బ్యాక్టీరియా వల్ల అది ఒకరి నుంచి ఒకరికి వ్యాపించడం, దగ్గడం, తుమ్మడం, ద్వారా ఎక్కుగా ఇది ఎదుటివారి నుంచి పిల్లలకు సోకుతుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరులేక కళ్ళె చేరడంతో పాటు శ్వాసగ్రంధులు మూసుకుపోతాయి. ఫలితంగా వారు ఊపిరి తీసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. దీంతో నిమోనియా వైరస్ వారిలో వేగంగా ప్రవేశిస్తోంది. ఈ వ్యాధి సోకినవారు దగ్గినప్పుడు వారిలో ఉండే వైరస్ గాలి తుంపర్ల ద్వారా ఇతరులు ఊపిరితిత్తుల్లోకి చేరుకుంటాయి. కొద్దిమందిలో మాత్రమే వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. ఈ వ్యాధి ఇతరులకు రాకుండా ఉండాలంటే దగ్గినప్పుడు మోహానికి అడ్డంగా రుమాలు ఉంచుకోవడం ఎంతైనా ఉంది.

**నిమోనియా చికిత్స ఎలా అందిస్తారు..**

యాంటిబయోటిక్స్ ఇవ్వడం ద్వారా ఏడు నుంచి పది రోజుల్లో నిమోనియా వ్యాధిని తగ్గించవచ్చు. అన్ని రకాల నిమోనియాకు చికిత్స ఒకేలా ఉండదు. వ్యాధి కారణాలను, లక్షణాలను అనుసరించి చికిత్స అందిస్తారు. అలాగే దీనికి అనేక వ్యాక్సీన్‌లు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధి తీవ్రతను బట్టి ఇంజెక్షన్‌ల రూపంలో యాంటి బయోటిక్స్‌ను ఇస్తారు. కనీసం పది రోజులు ఇలా మందులు వాడాలి. ఈ సమయంలో ఫ్లుయిడ్స్ ఆక్సిజన్ కూడా అవసరమవుతాయి. పది రోజుల తర్వాత మళ్లీ పరీక్షలను నిర్వహించి ఆసుపత్రిలోనే ఉంచి, చికిత్స అందించాలి. అవసరమైతే చికిత్సను బట్టి ఐసీయులో ఉంచి చికిత్స అందించాల్సి ఉంటుంది.

**ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి...**

చిన్న పిల్లలకు వర్షాకాలంలో వర్షపు నీళ్ళు, చలిగాలి తగలకుండా చూడాలి. శానిటైజర్, మాస్కులు ధరించాలి. ఐస్‌క్రీమ్‌లు, కూల్‌డ్రింక్‌కు దూరం ఉండాలి. చల్లగా ఉండే ఆహార పదార్థాలను పెట్టకూడదు. పొగతాగే వాళ్ళకు దూరం ఉండాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పిల్లలను ఎత్తుకునేముందు, వారికి ఆహారం తినిపించేటప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. పిల్లలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. జనం గుంపులుగా ఉండే చోట్లకు పిల్లలను తీసుకెళ్ళకూడదు. తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు పిల్లలకు దూరం ఉండాలి. పిల్లలకు ఐదేండ్లు దాటే వరకు తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలి.

# మనదేశంలోనే కులవ్యవస్థ : జస్టిస్ రాధారాణి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ కేవలం మన దేశంలోనే ఉందని, ఇది క్యాన్సర్, ఎయిడ్స్ జబ్బులకంటే ప్రమాదకరమైన జబ్బుగా మారిందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం(కెవిఎస్ఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు రాష్ట్ర కార్యదర్శి ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ రాధారాణి మాట్లా డుతూ ఓ వైపు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగు తుంటే మరోవైపు కులాదిపత్యంతో దాడులు, దౌర్జన్యాలు, కులదుహం కార హత్యలు పెరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. పౌరసమాజం, ప్రభు త్వం ఇలాంటి దుర్మార్గాలను సహించకూడదన్నారు. కుల మతాంతరవివాహాలు చేసుకున్న దంపతులు ఆర్థికంగా ఎదుగుతూ తమ అత్త, మామ, తల్లిదండ్రులను కంటి రెప్పలా కాపాడుతూ సమాజంలో మిగతావారికి ఆదర్శంగా నిలబడాలన్నారు. తమ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వయం ఉపాధి జీవిత గ్యారెంటీనే సార్ధకం చేసుకోవాలన్నారు. ప్రభుత్వాలు పౌర సహజ ప్రోత్సా హం అందే విధంగా కృషి చేయాలన్నారు. ఒంటరి తనం ఏదో తప్పు చేసిన మానసిక స్థితి నుంచి బయటపడాలన్నారు. నాటి సంఘసంస్కర్తలు అందరూ ఆదర్శంగా వివాహాలనే చేసుకున్నారన్నారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ మనుధర్మశాస్త్రం మనుషులను ముక్కలుగా చేసిందని, కులాలు, మతాల గీతలు గీసుకుని ప్రపంచాన్ని చూడలేక దేశం వెనుక పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయకుమార్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.వహీద్, కార్యదర్శి కృష్ణచంద్, ఉపాధ్యక్షురాలు జ్యోతి, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరూరి కుమార్, ఎం.ప్రకాశ్ కరత్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉసిల్ల కుమార్, గందం మనోహర్, బి.సుబ్బారావు, కెవిఎస్ఎస్ నాయకులు చింతకింది అశోక్, ఐలాపురం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రెండోదశ డిపిఆర్‌లు రెడీ !

- అన్నికారిడార్ల డిపిఆర్‌లకు తుదిమెరుగులు
- అధికారులతో కలిసి పురుగతిని సమీక్షించిన సిఎం రేవంత్‌రెడ్డి
- నాగోల్-శంషాబాద్ పొడవు 36.6 కి.మీ
- భూగర్భంలో నిర్మాణం 1.6 కి.మీ



మెట్రో రైల్ రెండోదశ విస్తరణ గురించి వివరిస్తున్న అధికారి ఎన్వీఎస్.రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త :** మెట్రో రైల్ రెండో దశ డిపిఆర్‌ల తయారీ పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌శాఖ సీనియర్ అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ ఏయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ ఎండి ఎన్వీఎస్‌రెడ్డి మెట్రో రెండో దశ కారిడార్‌ల అలైన్‌మెంట్, ముఖ్యమైన ఫీచర్లు, స్టేషన్లు మొద లైన వాటిపై సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు. అన్ని కారిడార్‌లకు సంబంధించిన డిపిఆర్‌లకు తుది మెరుగులు దిద్దుతున్నామని, ట్రాఫిక్ అంచనాల విషయంలో హెచ్ఎండిఏ హైదరాబాద్ మెట్రో పాలిటిన్ ఏరియాకి సిద్ధం చేస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటి ప్లాన్ ట్రాఫిక్ అధ్యయన నివేదిక కోసం హెచ్ఎఎంఎల్ ఎదురుచూస్తుందని ఎండి సీఎంకు తెలియజేశారు. మెట్రో మార్గాలలో ట్రాఫిక్ అంచనాలను సీఎంతో క్రాస్‌చెక్ చేయాల్సి ఉంటుంది. రెండోదశ మెట్రో కారిడార్‌ల కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డిపిఆర్‌ను సమర్పించడానికి ఇది తప్పనిసరి. గతంలో సీఎం నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించిన ప్రకారం... ఏయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్ ఇప్పుడు ఆరాంఘర్, 44.వ,నెంబర్ జాతీయ రహదారిలోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా ఖరారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వివిధ ప్రత్యామ్నాయాల గురించి లోతైన చర్చల తరువాత సీఎం మెట్రో రెండో దశ కారిడార్‌ల విస్తృత కాంటూర్‌లను ఆమోదించారు. అవి క్రింది విధంగా ఉన్నాయి. కారిడార్-4 : నాగోల్ ఆర్‌జిఐ 36.6 కిలోమీటర్లు, కారిడార్-5 రాయదుర్గ-కోకాపేట్ నియోపోలీస్ 11.6కి.మి, కారిడార్-6 ఎంజిబిఎస్-చాంద్రాయణగుట్ట 7.5 కిమి,కారిడార్-7 మియాపూర్-పటాన్‌చెరు 13.4 కిమీ కారిడార్-8 ఎల్‌బినగర్-హయత్‌నగర్ 7.1 కి.మీ. కారిడార్ 9 ఆర్‌జిఐ-ఫోర్త్‌సిటీ 40.కి.మి. కారిడార్-4 నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6కిమీ పొడవును కవర్ చేస్తుంది. ఎల్‌బినగర్, కర్మన్‌ఘాట్, ఓవైసి హాస్పిటల్, డిఆర్‌డిఓ, చాంద్రాయణగుట్ట, మైలార్ దేవుపల్లి, ఆరంఘర్, న్యూహైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా ఎన్‌హెచ్ మీదుగా ఈ మార్గం ఉంటుంది. ఈ ఏయిర్‌పోర్టు లైన్ వరుసగా నాగోల్, ఎల్‌బినగర్, చాంద్రాయణ్‌గుట్టవద్ద ఉన్న అన్ని మెట్రోలైన్‌లకు అనుసంధానించబడుతుంది. మొత్తం 36.6కిమిపొడవులో 35.కిమి ఎలవిఏట్ చేయబడుతుంది. అలాగే 1.6కిమి మార్గం భూగర్భంలో వెళ్తుంది. ఈ మార్గంలో భూగర్భ స్టేషన్ అయిన ఏయిర్‌పోర్టు స్టేషన్ సహా మొత్తం 24 మెట్రో స్టేషన్లు ఉంటాయి. కారిడార్ 5 రాయదుర్గ్ మెట్రోస్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలీస్ వరకు బయో డైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ, నానక్ రాంగూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కోకావే నియోపోలీసు మీదుగా బ్లూలైన్ పొడగింపుగా నిర్మించబడుతుంది. ఇది మొత్తం ఎలివేటెడ్ కారిడార్. ఇందులో దాదాపు 8.స్టేషన్లు ఉంటాయి. కారిడార్ 6 ఎంజిబిఎస్‌నుంచి చాంద్రాయణ్‌గుట్ట వరకు గ్రీన్‌లైన్ పొడగింపుగా నిర్మించబడుతుంది. ఎంజిబిఎస్ నుంచి 7.5 కిమీ లైన్, ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నూమా మీదుగా ప్రయాణిస్తుంది. సాలార్జంగ్ మ్యూజియం, చార్మినార్ నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికి ఈ పేర్లనే వాటి చారిత్రక ప్రాఉముఖ్యత కారణంగా స్టేషన్ పేర్లుగా ఉంచడం జరుగుతుంది. ప్రస్తుతం దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య 60.అడుగుల రోడ్డు శాలిబండ చాంద్రాయణ్ గుట్ట వరకు 80.అడుగుల రోడ్డు ఏకరీతిగా 100 అడుగులకు విస్తరించడం జరుగుతుంది. స్టేషన్ ఉండే ప్రాంతాలలో మాత్రం రోడ్డును 120 అడుగులకు విస్తరించడం జరుగుతుంది.రోడ్డు విస్తరణ మెట్రో అలైన్‌మెంట్‌లో దాదాపు 1100 ఆస్థులు ప్రభావితం అవుతున్నాయి. 400 ఆస్థులకు ఇప్పటికే నోటీఫికేసన్లు జారీచేశాం మిగిలినవి పురోగతిలో ఉన్నాయి. ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన వారసత్వ ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నాయి. వాటన్నింటికి తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలు మెట్రో పిల్లర్ సర్దుబాటు ద్వారా అవి భంగం కాకుండా చూస్తున్నాము. ఇది దాదాపు 6.స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ మెట్రో కారిడార్. కారిడార్ 7 ముంబై హైవేప రెడ్‌లైన్ పొడిగింపుగా నిర్మించబడుతుంది. ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి ప్రారంభించి పటాన్ చెరు వరకు ఉన్న 13.4 కిమి లైన్ ఆల్విన్ ఎక్స్‌రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఇఎల్, ఇక్రిసాట్ మీదుగా వెళ్తుంది. ఇది దాదాపు 10 స్టేషన్లతో ఉండే పూర్తి ఎలివేటెడ్ కారిడార్.కారిడార్ 8 విజయవాడ హైవేపై ఎల్‌బినగర్ వైపు నుంచి రెడ్‌లైన్ పొడిగింపుగా నిర్మించడం జరుగుతుంది. ఎల్‌బినగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిమి కారిడార్ చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసి కాలనీల మీదుగా వెళ్తుంది. ఈ పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌లో దాదాపు 6 స్టేషన్లున్నాయి. సీఎం ప్రత్యేక దృష్టిసారించిన ఫోర్త్‌సిటీ మెట్రో కనెక్టివిటి లైన్‌కోసం అనేక ఆకర్షణీయమైనఫీచర్లతో వినూత్న రీతిలో డిపిఆర్ తయారు చేస్తున్నాము. కొన్ని నెలల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం దీన్ని సమర్పించడం జరుగుతుంది. రూ.8 వేల కోట్లతో కలిపి మొత్తం రెండోదశ ప్రాజెక్ట్‌కు అయ్యే వ్యయం దాదాపు రూ.32.237కోట్లు+8వేల కోట్లుగా అంచనా వేయబడింది. ఇతర మెట్రో రైల్ ప్రాజెక్టుల మాదిరిగానే తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా అమలు చేయడానికి ప్రతిపాదించబడింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిషోర్, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్‌రెడ్డి, హెచ్ఎండిఏ కమీషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రాపాలి, ఇతర అధికారులు ఈ చర్చలో పాల్గొన్నారు.

## పాత నేరస్థుడి హత్య

**ముషీరాబాద్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** పాత నేరస్థుడిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. సీఐ, స్థానికుల కథనం ప్రకారం ముషీరాబాద్‌లోని భరత్‌నగర్‌లో నివసించే మహ్మద్ బషీర్(30) రోజు కూలీగా పనిచేసేవాడు. చిన్నతనం నుండి అల్లరి చిల్లరిగా తిరేగే బషీర్‌కు దుర్వ్యసనాలు ఉండటమే కాకుండా పలు నేరాలలో ముద్దాయిగా ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి డీబీఆర్ మిల్ వద్ద బషీర్‌ను ఎవరో గొంతు కోసి హత్య చేశారని, అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు. ఎవరు హత్య చేశారు, ఎందుకు హత్య చేశారు అనే విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

## కళాశాల బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**మలక్‌పేట ,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనదారుడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి సంబంధించిన నర్సింగ్ కళాశాల బస్సు ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం డబిల్ పుర కోమట్ వాడికి చెందిన దాసకొండ ఉమేష్ (35) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మలక్ పేట వద్ద యశోద ఆసుపత్రికి సంబంధించిన నర్సింగ్ కళాశాల బస్సు యశోద ఆసుపత్రి నుంచి దిల్ షుక్ నగర్ వెళ్తూ ద్విచక్ర వాహనదారుడుని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు చాదర్ ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# రియల్ రంగంపై హైడ్రా ఎఫెక్ట్

- భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ స్థలాల్లో హద్దులు తెలియక అయోమయం
- కొనుగోలుకు జంకుతున్న జనం



**హైదరాబాద్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాలపై హైడ్రా విసిరిన పంజా రియల్ రంగంను తాకింది. జోరుమీద ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారం హైడ్రా కూల్చివేతలతో తగ్గుముఖం పట్టింది. ఏస్థలాలు ఎలాంటివో తెలియక అయోమయంలో పడిపోయిన జనం రియల్‌రంగలో పెట్టుబడులు పెట్టేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. నిత్యం జనాలతో కిక్కిరిసే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ప్రస్తుతం జనాలు లేక వెలవెలబోతున్నాయి.

మేడ్చల్ జిల్లా పరిధి నగర శివారు, ఔటర్ రింగు పరిసర ప్రాంతాల్లో గత కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుంది. రియల్‌రంగంలో పేరుగాంచిన అనేక కార్పొరేట్ సంస్థలు ఔటర్ పరిసర ప్రాంతాల్లో లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ టవర్ల నిర్మాణం చేపట్టారు. లేక్‌వ్యూ పేరుతో గేటెడ్ విల్లాలను సైతం నిర్మిస్తున్నారు. కొనుగోలుదారుల సంఖ్య గణనీయంగా ఉండడంతో రిజిస్ట్రేషన్లు అదే స్థాయిలో జరిగాయి. ఇదంతా హైడ్రా రాకముందు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ఎఫ్‌టిఎల, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా నిర్దాక్షిణ్యంగా కూల్చివేడం రియల్‌రంగపై తీవ్ర ప్రభావం చూపింది. కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపకపోవడంతో క్రయవిక్రయాలు తగ్గి రిజిస్ట్రేషన్ కార్యాలయాలు బోసిపోతున్నాయి.

**అవగాహన లేక...**

రియల్‌వ్యాపారులు వ్యాపారం కోసం అనేక విధాలుగా జనాలను ఆకట్టుకుంటారు. అందులో ప్రధానమైనది 'లేక్‌వ్యూ' అని చెప్పవచ్చు. లేక్‌వ్యూ అనగానే ఎగబడి కొనుగోలు చేశారు. అయితే అదే కొంతమంది పాలిట శాపంగా మారింది. చెరువుల విస్తీర్ణం.. సదరు చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జన్ల పరిధిపై చాలమందికి అవగాహనం లేకపోవడం, ఎన్నడూ ఎఫ్‌టిఎల్, బఫర్‌లలో చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు కారణమై ఉండవచ్చు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రా ఏర్పాటు చేసింది. కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రంగనాథ్ మరుసటి రోజు నుండే చెరువుల విస్తీర్ణం, ఎఫ్‌టిఎల్, బఫర్‌ల ఆక్రమణలపై ఆరా తీసి చర్యలు చేపట్టడంతో ఒక్కసారిగా జనాలు ఎఫ్‌టిఎల్, బఫర్‌పై చర్చించుకోవడం మొదలుపెట్టారు.

**హద్దులు తెలియక...**

ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వేచేసి ఆయా చెరువుల హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు చెరువులు, నాలాల, విస్తీర్ణం, ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ల పరిధిని తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేసి ఉంటే జనాల్లో కాసింత అవగాహన వచ్చి ఉండేది. అదే సమయంలో హద్దులు తెలిసేవి. చెరువుల వివరాలు వెబ్‌సైటలో ఉన్నాయని పేర్కొంటున్నప్పటికి అందరికి అది వెసులుబాటుకాక అయోమయానికి గురవుతున్నారు.దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ఫ్లాట్లు, ఇండ్ల స్థలాలు, విల్లాలు కొనుగోలు చేసేందుకు జంకుతున్నారు. అయితే ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంటే మరలా రియల్‌రంగం పుంజుకునే అవకాశం లేకపోలేదు.



వండర్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను అందుకుంటున్న బాలనర్తకి వేక్షాహ్నిక, గురువు సుధాకర్

## కూచిపూడి నృత్యంలో బాలనర్తకి వేక్షాహ్నిక వండర్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్

**రవీంద్రభారతి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త :** అతిపిన్న వయస్సుల్లోనే కూచిపూడి నృత్యప్రదర్శన లో ఆదివారం కళాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన బాలనర్తకి వేక్షాహ్నిక పంచాది అత్యంత ప్రతిభను చాటుకొని వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదుచేసుకుంది. నృత్య గురువు ఎస్.సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో, సౌత్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ ఆఫ్ ఇంటర్నేషనల్ వండ్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ డా.జ్యోతిరంగా పర్యవేక్షణలో చిన్నారి కళాకారిణి గంటసేపు నిర్విరామంగా పలు అంశాలతో కూచిపూడి నృత్యప్రదర్శన కావించి రికార్డ్‌ను కైవసం చేసుకుంది.ఈ సందర్భంగా నృత్య గురువు సుధాకర్‌రెడ్డి వేక్షాహ్నిక తల్లిదండ్రులు డివి ప్రసాద్, శ్వేతలను అభినందిస్తూ పిల్లలు కేవలం చదువుతోపాటు శాస్త్రీయనృత్యకళల్లో రాణించేందుకు అవకాశం కల్పించి ప్రోత్సహించాలని కోరారు.

# మూసీ బాధితులకు పార్టీల భరోసా

- హామీ ఇచ్చిన బిజెపి, టిఆర్ఎస్, కాంగ్రెస్
- పార్టీల వారీగా బాధితులతో సమావేశం
- ఇండ్లు కాపాడాలని బాధితుల వేడుకోలు
- కూల్చివేతలను వ్యతిరేకిస్తామన్న నాయకులు
- బిజెపి నాయకుల వంటావార్పు
- బాధితులతో ఎమ్మెల్యే సమావేశం
- అండగా ఉంటామని కాంగ్రెస్ భరోసా



సమస్యను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి వివరిస్తున్న బాధితుడు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** మూసి పర్యాయక ప్రాంతంలో వారం రోజులుగా జరుగుతున్న కూల్చివేత ప్రక్రియలకు సంబంధించి పలు రాజకీయ పార్టీల నాయకులు బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఇండ్ల కూల్చివేతకు తాము వ్యతిరేకమంటూ బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధిలోఉన్న నివాసాలను కూల్చివేసేందుకు మూసి రివర్‌ఫ్రంట్, రెవెన్యూ అధికారులు నాలుగు రోజులుగా మార్కింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. తమ నివాసాలు కూల్చివేస్తే ఎట్లా బతికేది అంటూ బాధితులు పార్టీ నాయకులను ప్రాదేపడుతున్నారు. మా జీవితాలతో చెలగాటం ఆడవద్దని నివాసాలను కాపాడాలని పార్టీ నేతల కాళ్ళు పట్టుకుంటున్నారు. మల్కాజ్గిరి ఎంపి, బీజేపీ జాతీయ నాయకుడు ఈటెల రాజేందర్, కార్పొరేటర్లు రాధాధీరథరెడ్డి, పవన్‌కుమార్, రంగ నరసింహగుప్తా, ప్రియమహేశ్వర్ రెడ్డి, చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్, టిఆర్ఎస్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్‌రెడ్డి టిఆర్ఎస్ నాయకులు లింగాల రాహుల్‌గౌడ్, తోట మహేష్ యాదవ్, అనంతుల రాజారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ టీపిసిసి ప్రచార కమిటీ ఛైర్మన్ మధు యాష్కిగౌడ్, కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్, విజయరంగా తదితరులు బాధితులకు భరోసా కల్పిస్తున్నారు.

**ఇల్లు కూల్చాలంటే మమ్మల్ని దాటి వెళ్లాలి:సామ**

పేద మధ్యతరగతి ప్రజల నివాసాలను కూల్చి వేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు సామ రంగారెడ్డి, కొత్తపేట చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్లు నాయికోటి పవన్‌కుమార్, రంగ నరసింహగుప్త హెచ్చరించారు. హైడ్రా, మూసి రివర్ బెడ్ పేరుతో ఇండ్లను కూల్చివేతను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వినాయక్‌నగర్‌కాలనీలో బిజెపి ఆధ్వర్యంలో ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేస్తూ బాధితులతో కలిసి వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పేదల పక్షాన నిలుస్తుందని కూల్చివేతలను తాము అడ్డుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇల్లు కూల్చాలంటే ముందుగా బిజెపి నాయకులను దాటి బుల్డోజర్లు వెళ్లాలని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగేవరకూ తాము అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మూసి ప్రాంత ప్రజలకు వారం రోజులుగా కంటినిండా కునుకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జోలికి వస్తే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మంచి రాజేష్, రుద్రాల శంకర్, వినోద్‌యాదవ్, పాల్గొన్నారు.

**మూసీ నివాసితుల సమస్యపై సిఎంతో మాట్లాడతా: మధు యాష్కీగౌడ్**

చైతన్యపురి, కొత్తపేట డివిజన్‌లోని మూసి పరివాహక నివాసతులతో టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయష్కీగౌడ్ ఫోన్లో మాట్లాడారు. ప్రజలెవరూ భయపడవద్దని, ప్రజల ఇల్లు ఎవరు కూల్చారని భరోసా ఇచ్చారు. చైతన్యపురి కాంగ్రెస్ నాయకుడు శశిధర్‌రెడ్డితో కలిసి మూసి ప్రాంత నివాసస్థులు మధుయాష్కిగౌడ్‌కి ఫోన్ చేసి హైడ్రా కూల్చివేతల విషయంపై ఆవేదన వ్యక్తం చేయగా ఆయన వారికి ధైర్యం చెప్పారు. కూల్చివేతల విషయంలో మూసి సమీప నివాసులకు నష్టం జరగకుండా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానన్నారు. అన్ని అనుమతులు తీసుకొని, ఇళ్లు నిర్మించుకున్న వారికి నష్టం జరగకుండా చూడాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మించి ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి భయభ్రాంతులకు గురికావద్దని, నివాసస్థులతో త్వరలో సమావేశం అవుతానని అన్నారు. ప్రస్తుతం మూసి రివర్‌బెడ్‌లో ఉన్న ఇండ్లనే ఖాళీ చేయించడం జరుగుతుందని, అది కూడా ఇష్టపూర్వకంగా వెళ్లే వారికి డబల్‌బెడ్‌రూమ్ తాళం ఇచ్చి పంపించడం జరుగుతుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలను కాపాడుకుంటుందని పేర్కొన్నారు.

**నేను భరోసాగా నిలుస్తా: ఎమ్మెల్యే**

ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మీ ఇంటికి నేను భరోసాగా నిలుస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇంటిపైకి బుల్డోజర్ వెళ్లాలంటే ముందు నన్ను దాటాలన్నారు.చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ఎలాంటి మార్కింగులు వేసిన మీకు ఎలాంటి నష్టం జరగనివ్వనని హామీ ఇచ్చారు. అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని ప్రజలకు ఎలాంటి నష్టం కలిగినివ్వమని అన్నారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడితే ఊరుకోమన్నారు. 2013 పార్లమెంట్ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు లింగాల రాహుల్ గౌడ్, తోట మహేష్ యాదవ్, అనంతుల రాజారెడ్డి, ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, బాధితులు పాల్గొన్నారు.